Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 190 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 ఆగస్టు 2024 గురువారం పేజీలు : 4

### మత మార్పిడి జరిపితే 20 ఏళ్లు జైలు

లఖ్‌నవూ : మత మార్పిడి నిషేధ చట్టాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. మత మార్పిడికి పాల్పడిన నిందితుడికి భారీగా జరిమానా, బెయిల్ దొరకడం కష్టతరం, జీవిత ఖైదు విధించేలా చట్టసవరణను రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపా దించింది. ఇప్పటివరకు బాధిత కుటుంబం చేసిన ఫిర్యాదు మేరకు మత మార్పిడి నిరోధక చట్టాన్ని పోలీసులు ప్రయోగిస్తున్నా రు. అయితే, యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ ఆమోదం పొందితే మత మార్పిడికి సంబంధించి ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. మతం మారకపోతే ప్రాణాలు తీస్తామనే పద్ధతిలో తీవ్ర బెదిరింపులకు పాల్పడిన సందర్భంలో నిందితుడికి యావజ్జీవం కూడా విధించే అవకాశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో (ఉత్తరప్రదేశ్ చట్టవ్యతిరేక మత మార్పిళ్ల నిషేధ బిల్లు-2024(సవరణ) ఉంది. అలాగే, జరిమానాను రూ.10 లక్షల వరకు విధించవచ్చు.

# ఈ సారి కేబినెట్ భేటీ సంచలనమే!

## తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఫిక్స్.. పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం..!



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం మధ్యాహ్నం అసెంబ్లీ కమిటీ హాల్లో జరగనున్నది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తొలుత సచివాలయంలో నిర్వహించాలనుకున్న కేబినెట్ భేటీ అసెంబ్లీ కమిటీ హాల్‌కు మారింది. మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుపై ఈ సమావేశం చర్చించనున్నది. ఆ తర్వాత అసెంబ్లీ, మండలిలో చర్చ జరగనున్నది. ఈ అంశానికి తోడు కొత్త రేషన్ కార్డుల జారీపైనా కేబినెట్ చర్చించి విధివిధానాలను, షెడ్యూలును ఖరారు చేయనున్నది. గతేడాది డిసెంబర్ ఈ ఏడాది జనవరి మధ్య నిర్వహించిన ప్రజాపాలన స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన అభయహస్తం దరఖాస్తుల్లో కొత్త రేషన్ కార్డుల జారీ రిక్వెస్టుపై స్పెషల్ కమిటీ ఇప్పటికే లోతుగా అధ్యయనం చేసింది. కొత్త రేషన్ కార్డులను ఎప్పుడు జారీ చేస్తారంటూ.. అటు ప్రజల నుంచి ఇటు విపక్షాల నుంచి డిమాండ్ వస్తున్న నేపథ్యంలో కేబినెట్ భేటీలో దీనిపై చర్చించి నిర్దిష్టమైన విధివిధానాలను, అర్హతలను, జారీకి సంబంధించి షెడ్యూలును ఖరారు చేసే అవకాశమున్నది. మరోవైపు హైదరాబాద్ అభివృద్ధితో పాటు మూసీ నది ప్రక్షాళన, మౌలిక సౌకర్యాల కల్పన, రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు విస్తరణ తదితర పలు అంశాలకు సంబంధించి కూడా చర్చించనున్నట్లు తెలిసింది. ఇందులో కొన్ని పనులకు ప్రపంచ బ్యాంకు నుంచి ఆర్థిక సాయం పొందాలని ప్రభుత్వం భావిస్తున్నందున కేబినెట్ భేటీలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. వీటితో పాటు మరికొన్ని అంశాలను సైతం కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం.

# బెదిరింపులా...! బుజ్జగింపులా...!!




### కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలపైనా బీఆర్ఎస్ మైండ్ గేమ్

హైదరాబాద్ : బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డిమళ్లీ బీఆర్ఎస్ లో చేరడంతో ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. దీంతో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన మిగతా ఎమ్మెల్యేల పైన బీఆర్ఎస్ మైండ్ గేమ్ ప్రారంభించింది. పార్టీని వీడి వెళ్లిన వారంతా తిరిగి వెనక్కి రాబోతున్నారంటూ ప్రచారం మొదలు పట్టింది . ఈ మేరకు బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. రకరకాల కారణాలతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలు ఆ పార్టీలో ఇమడలేకపోతున్నారని, మళ్ళీ వెనక్కి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని , ఈ మేరకు సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారాన్ని ఒకవైపు చేస్తూనే, మరోవైపు అనే రాజకీయ వ్యూహాల్లో నిమగ్నం అయ్యారు . భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుని టీ తాగేందుకు పిలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆయనతో ఉన్న ఫోటోను బయటకు పంపించారు. దీంతో ఆయన కూడా మళ్లీ కాంగ్రెస్ ను విడి బీఆర్ఎస్ లో చేరబోతున్నారనే ప్రచారం మొదలైంది. ఇదే జాబితాలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేరును కూడా చేర్చారు . దీంతో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు అలర్ట్ అయ్యారు. తాము కాంగ్రెస్ ను వీడేది లేదని , పార్టీలోనే కొనసాగుతామని , తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు వివరణ ఇచ్చారు. స్నేహపూర్వకంగా టీ తాగేందుకు పిలిస్తే వెళ్లామని, కానీ కాంగ్రెస్ ను వీడుతున్నట్లు ప్రచారం చేయించడం కరెక్ట్ కాదని , ఆ పార్టీలో ఉన్న నేతపై అదే పార్టీలో ఉన్న పెద్దలకు అనుమానం కలిగేలా చేయడం కూడా రాజకీయ వ్యూహంలో భాగంగానే అనే విషయం అర్థం అవుతోంది. కాంగ్రెస్ ( %జశీఅస్త్రతీవం౦% )లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో బీఆర్ఎస్ మైండ్ గేమ్ మొదలు పెట్టింది. బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మళ్ళీ ఎందుకు వెనక్కి వచ్చారనే దానిపై ఇప్పుడు రాజకీయంగా ఆసక్తి నెలకొంది. తన ఎన్నిక చెల్లదని హైకోర్టులో పడిన పిటిషన్ పై విచారణ లాయర్ ను గతంలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసింది. ఆయన కాంగ్రెస్ లో చేరడంతో లాయర్ ను తప్పించారు. ఇప్పుడు లాయర్ ను కొనసాగించాలని కేటీఆర్ ను కోరానని బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చెబుతున్నారు. అయితే కాంగ్రెస్ లోని గ్రూపు రాజకీయాల్లో కృష్ణమోహన్ రెడ్డి ఇమడలేకపోయారు అని, ఆయన డిమాండ్లను కూడా కాంగ్రెస్ నెరవేర్చే విషయంలో అంత ఆసక్తి చూపించకపోవడంతోనే కృష్ణమోహన్ రెడ్డి మళ్ళీ బీఆర్ఎస్ గూటికి చేరారు అనే ప్రచారం జరుగుతుంది.

## రేవంత్ ఆ వేగమే వేరప్పా.. ఇట్టే కనెక్టు అయిపోయారుగా?



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి గవర్నర్ గా నియమితులైన జిష్ణు దేవ్ వర్మ.. బుధవారం హైదరాబాద్ కు వచ్చారు. ఎయిర్ పోర్టు నుంచి నేరుగా రాజ్ భవన్ కు చేరుకున్న ఆయన.. ప్రమాణస్వీకారోత్సవాన్ని పూర్తి చేశారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. త్రిపురకు చెందిన ఒకరు ఒక రాష్ట్రానికి గవర్నర్ గా ఎంపిక కావటం ఇదే తొలిసారి. ఇదొక ఎత్తు అయితే.. త్రిపుర గవర్నర్ గా తెలంగాణ ప్రాంతానికి చెందిన ఇంద్రసేనారెడ్డి వ్యవహరిస్తుండటం.. అదే సమయంలో త్రిపురకు చెందిన జిష్ణు దేవ్ వర్మ తెలంగాణ గవర్నర్ గా నియమితులు కావటం కో ఇన్సెడెంట్ గా చెప్పాలి. తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టున్న నేపథ్యంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన ఆసక్తికర అంశాల్నివెల్లడించారు. గవర్నర్ గా ఎంపికైన విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా ఫోన్ చేసినట్లు చెప్పారు. కానీ.. ఏ రాష్ట్రానికి అన్న విషయాన్ని ఆయన చెప్పలేదు. ఈ విషయాన్ని వివరిస్తూ.. “శనివారం రాత్రి ప్రధాని నరేంద్ర మోడీ నుంచి కాల్ వచ్చే వరకు నా నియామకం గురించి తెలీదు. మీరు త్రిపుర రాష్ట్రం బయట పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. నాకెలాంటి బాధ్యత అప్పగించినా నిర్వర్తించటానికి సిద్ధమని ప్రధానికి చెప్పా” అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోన్ కాల్ తర్వాత.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి తనకు మరో కాల్ వచ్చిందన్నారు. “ఆయన నాకు స్వాగతం పలుకుతూ ఫోన్ చేశారు. సీఎం రేవంత్ ఫోన్ కాల్ తో నన్ను తెలంగాణ రాష్ట్రానికి గవర్నర్ గా వెళుతున్నట్లు అర్థమైంది. గతంలో త్రిపుర ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించాను. అది రాజకీయ పదవి. ఇప్పుడు రాజ్యాంగబద్ధమైన పదవి. ఇప్పుడు కూడా బాధ్యతగా వ్యవహరిస్తా. తెలంగాణ ముఖ్యమంత్రితో సమన్వయం చేసుకుంటూ నా విదులు నిర్వర్తిస్తా” అని వ్యాఖ్యానించారు. ఏమైనా.. బీజేపీయేతర పార్టీకి చెందిన ముఖ్యమంత్రి ఒకరు వెను వెంటనే విషయాల్ని అర్థం చేసుకోవటం.. అల్లుకుపోవటం లాంటివి చూస్తే.. రేవంత్ స్పీడ్ వేరే లెవల్ అన్న భావన కలుగక మానదు.

## బతుకమ్మ చీరల పథకంలో అవినీతే..



హైదరాబాద్: సభను తప్పుదోవ పట్టించటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఇచ్చిన సమయాన్ని వినియోగించుకోవడానికి చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సూచన అనే ముసుగులో మోసం అనే ప్రణాళికను ప్రజల మెదళ్లలో జొప్పిస్తున్నారన్నారు. పదేళ్ల మీ పాలనలో మీ అనుభవాలు మీకు ఉన్నాయని.. ప్రజల అనుభవాలు వారికి ఉన్నాయన్నారు. మీ పాలన అనుభవాలతో ప్రజలు మాకు అధికారం ఇచ్చారన్నారు. పదేళ్ల పాలన చేసిన వారు పది నెలలు పూర్తి చేసుకొని ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. బతుకమ్మ చీరల పథకంలో అవినీతి జరిగిందన్నారు. నేత కార్మికులకు పని కల్పించామంటూ అబద్ధాలు చెప్పారని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరల డబ్బులు బకాయి పెడితే మేం చెల్లించామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బతుకమ్మ చీరల కాంట్రాక్ట్ బినామీలకు అప్పగించారని.. సూరత్ నుంచి కిలోల చొప్పున చీరలు తెచ్చి కమీషన్ కొట్టేశారని రేవంత్ ఆరోపించారు. ఎంఎంటీఎస్‌ను విమానాశ్రయం వరకూ వేస్తామంటే అనుమతి ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. దీని వెనుక ఆర్థిక కుట్ర ఏంటో అందరికి తెలియాలన్నారు. మేమెప్పుడు మీలాగా పాతబస్తీని ఇస్తాంబుల్ చేస్తామని చెప్పలేదన్నారు. హుస్సేన్‌సాగర్ నీళ్లను కొబ్బరినీళ్లలాగా మార్చుతామనలేదని రేవంత్ ఎద్దేవా చేశారు. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని.. టూరిజం హబ్ క్రియేట్ చేస్తామంటున్నామని తెలిపారు. ప్రపంచస్థాయి వైద్యం హైదరాబాద్ నగరంలో అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏషియన్ గేమ్స్ నిర్వహించిన హైదరాబాద్‌లో.. స్టేడియమ్స్ అన్నీ తాగుబోతుల అడ్డాగా మారాయని రేవంత్ పేర్కొన్నారు. ఒలింపిక్స్‌లో కాంస్యం వస్తేనే వందకోట్ల మంది సంబరపడే పరిస్థితి నెలకొందన్నారు. నిఖత్ జరీన్‌కు ఉద్యోగం ఇస్తామని చెప్పి మీరు ఇవ్వలేదని రేవంత్ అన్నారు. మహ్మద్ సిరాజ్‌కు గ్రూప్1 ఉద్యోగం ఇస్తున్నామన్నారు. ఫార్మాసిటీ అని వాళ్లన్నారని.. మేం ఫార్మా విలేజ్‌లు అంటున్నామన్నారు. వేల ఎకరాల్లో ఫార్మా కంపెనీలు పెడితే ఆ ప్రాంతమంతా కలుషితమవుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వ్యవసాయానికి అనుసంధానం చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కేటీఆర్ 100 శాతం ఆర్టిఫిషియల్, సున్నా శాతం ఇంటెలిజెన్స్ అన్నారు. ముచ్చర్లలో గొప్ప నగరం సృష్టిస్తున్నామని రేవంత్ అన్నారు. ముచ్చర్లలో నాలుగో నగరాన్ని నిర్మిస్తున్నామని.. మన భవిష్యత్ నగరంగా ముచ్చర్ల కాబోతుందని.. మెట్రో సౌకర్యం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్కెపోయాయని.. ప్రతిపక్షంగా మీ పాత్ర పోషించాలని హితవు పలికారు. కేసీఆర్ చీల్చి చెండాడుతా అంటే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకొని వచ్చానన్నారు. అగ్రికల్చర్, ఇండస్ట్రీ, ఐటీ, ఎక్సైజ్ పాలసీలు తీసుకొస్తామని రేవంత్ పేర్కొన్నారు.

# ద్రవ్య వినియోగ బిల్లుపై రచ్చ రచ్చ...




## కేటీఆర్ వర్సెస్ సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏడో రోజూ హాట్ హాట్‌గానే సాగుతున్నాయి. ద్రవ్య వినిమయ బిల్లును డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టగా.. అది కాస్త ఎక్కడెక్కడికో పోయింది. కాసేపు మంత్రులు వర్సెస్ కేటీఆర్‌గా పరిస్థితులు నడవగా.. మరికొద్దిసేపు సీఎం రేవంత్ రెడ్డి–కేటీఆర్‌ల మధ్య పెద్ద మాటల యుద్ధమే నడిచింది. ఈ క్రమంలో ఒకింత ఆగ్రహానికి లోనైన ముఖ్యమంత్రి.. కేటీఆర్ రెచ్చగొట్టే ప్రయత్నం చేయకండి అని హెచ్చరించారు!

**అసలేం జరిగింది..?** ‘ఫార్మా సిటీ భూములు వెనక్కి ఇస్తామని హామీ ఇచ్చారు.. చేయండి. మూసీని లండన్ చేస్తాం అంటున్నారు.. చేయండి. మూసీ సుందరీకరణను స్వాగతిస్తున్నాము. రూ.16వేల కోట్లతో మేము ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కానీ ఇప్పుడు లక్షన్నర కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఎందుకు ప్రతిపాదన పెరిగిందో డీపీఆర్ సబ్మిట్ చేయాలి..?’ అని అసెంబ్లీ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి మాట్లాడిన ప్రతి విషయంపైనా సీఎం రేవంత్ రెడ్డి ఓ రేంజిలో స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్లు ఇచ్చారు.

**కుట్ర ఏంటి..?** ‘ కేటీఆర్ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మోసం అనే ప్రణాళికలు అమలు చేస్తున్నారు. పదేళ్లు ఏలిన మీరు పది నెలలు నిండని ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు. బతుకమ్మ పథకా న్ని ప్రారంభించిన ఏడాది సిరిసిల్లలో నేతన్నలు ఆ చీరలు నేశారా?. మీ బినామీలకు కాంట్రాక్టు ఇచ్చి సూరత్ నుంచి తూకంలో తెచ్చారా?. కమిషన్లు కొట్టి పేదలను మోసం చేశారా.. లేదా?. ఎంఎంటీఎస్‌ను ఎయిర్ పోర్ట్‌లోనికి ఎందుకు అనుమతి ఇవ్వలేదు..? దీని వెనుక ఉన్న కుట్ర ఏంటి?. ముచ్చర్ల భూ సేకరణపై వారే ఊహించుకుంటున్నారు. హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లలా మారుస్తానని మీలా నేనెప్పుడూ అబద్ధాలు చెప్పలేదు’ అని రేవంత్ రెడ్డి ప్రశ్నలు సంధిస్తూ కన్నెర్రజేశారు.

**కేటీఆర్ సవాల్..** కాగా.. అంతకుముందు కేటీఆర్ వర్సెస్ మంత్రుల మధ్య మాటల యుద్ధం సాగింది. ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కోతలు, ఎగవేతలతో మసిబూసి మారేడుకాయ చేశారు. రైతు భరోసాకు బడ్జెట్ ఏదని ప్రశ్నించారు. పెన్షన్ డబుల్ చేసే కేటాయింపులు ఎక్కడని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు ఎన్నికల ముందు రజినీకాంత్, తర్వాత గజినీకాంత్‌లా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ పోరాటాల గడ్డ.. మభ్యపెడితే ఊరుకోదని కేటీఆర్ అన్నారు. చార్జిషీట్లు, రికవరీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై వేయాలన్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కేటీఆర్ సవాల్ ఒకటి విసిరారు. అశోక్ నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి వెళదామని.. ఒక్క కొత్త ఉద్యోగం ఇచ్చినట్లు యువకులు చెబితే అక్కడే రాజీనామా చేయడమే కాదు.. రాజకీయ సన్యాసం చేస్తానంటూ కేటీఆర్ ఛాలెంజ్ చేశారు. పైగా రేవంత్, భట్టికి పౌర సన్మానం కూడా చేస్తామని తెలిపారు.

**కౌంటర్లే కౌంటర్లు!** ఈ క్రమంలోనే మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు ఒక్కొకటి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. మేము చేయకపోతే ప్రజలే మాకు బుద్ధి చెబుతారన్నారు. కొంచెం ఓపికగా ఉండాలని తెలిపారు. దీనికి తిరిగి కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఓపికగా ఉండాల్సింది మంత్రులు అని.. తాము కాదని కేటీఆర్ పేర్కొన్నారు. వంద రోజులలో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ఎవరు చెప్పమన్నారని ప్రశ్నించారు. పోస్టులు పెంచమంటే పోలీసులతో దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సన్నాసులు గ్రూప్ 2 వాయిదా వేయమంటున్నారని సీఎం రేవంత్ అవమానిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. జీవో 46సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

# సంపాదకీయం

## ఏపీ మీద కాంగ్రెస్ ఫుల్ ఫోకస్...?

ఏపీ అన్నది కాంగ్రెస్ కి కంచుకోట. దేశమంతా శ్రీమతి ఇందిరాగాంధీని ఓడించినా జనతా ప్రభంజనం తాకిడి సోకని నేల ఒక్క ఏపీ మాత్రమే. అలాంటి ఏపీ గత పదేళ్లుగా కాంగ్రెస్ ని దూరం పెట్టేసింది. అంతే కాదు చట్ట సభలలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. కనీసంగా అయిదారు శాతం ఓటు షేర్ కూడా కాంగ్రెస్ కి లేకుండా పోయింది. కాంగ్రెస్ బేస్ మొత్తం పోయింది. అది అత్యధిక భాగం వైసీపీకి చేరింది. ఈ నేపథ్యంలో వైసీపీ మీద మోజుతో రెండు ఎన్నికల్లో ప్రజలు ఓట్లేశారు. ఒకసారి విపక్షంగా ఉన్నా భారీగానే సీట్లు దక్కాయి. మరోసారి ఏకంగా 151 సీట్లతో అందలం మీద వైసీపీని కూర్చోబెట్టారు. 2024 ఎన్నికల్లో మాత్రం వైసీపీని పూర్తిగా పక్కన పెట్టారు. ఈ పరిణామమే ఇపుడు కాంగ్రెస్ లో కొత్త ఆశలు రేపుతోంది. అదే టైం లో ఏపీలో కాంగ్రెస్ వేళ్ళూనుకుంటే వైసీపీ దెబ్బ తింటుందని ఆ పార్టీ ఆలోచిస్తోంది. వైసీపీకి ఎన్నో సమస్యలు ఇలా వెంటాడుతున్నాయి. అధికార టీడీపీ జనసేన బీజేపీ కూటమిని ఎదిరించడం ప్రధానమే కానీ దాని కంటే ముందు వైసీపీ అస్థిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది అని అంటున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కి అనుకూల గాలులు వీస్తున్నాయి. దక్షిణాదిన చూసుకుంటే కేరళలో లోక్ సభ ఎన్నికలో మెజారిటీ సీట్లు గెలుచుకుంది. కర్ణాటకలో ఎంపీ సీట్లు తగ్గినా దాని కంటే ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకుంది. తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటింది. ఇక తమిళనాడులో డీఎంకేతో కలసి కాంగ్రెస్ పటిష్టంగా ఉంది. ఎటొచ్చి ఏపీలోనే కాంగ్రెస్ తీరు అర్థం కాకుండా ఉంది. వైఎస్సార్ ఫ్యామిలీ ఆయన వారసత్వం అని చెప్పి షర్మిలను తెచ్చి పెట్టినా ఆమె వల్ల పార్టీ ఏ మాత్రం పుంజుకోవడం లేదని కాంగ్రెస్ అధినాయకత్వంలో అంతర్మధనం కనిపిస్తోంది అని అంటున్నారు. ఏపీలో కాంగ్రెస్ ని ఒక లెవెల్ కి పెంచాలీ అంటే ఫేస్ వాల్యూ ఉన్న లీడర్ షిప్ కావాలన్నది ఆ పార్టీ ఆలోచనగా ఉంది. ఏపీలో చూస్తే కాంగ్రెస్ నేతలు ఉన్నారు. కానీ జనం లోకి వెళ్ళి పార్టీని పటిష్టం చేసే వారు అయితే లేరు అని అంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ వైపు కాంగ్రెస్ చూపు ఉందని అంటున్నారు. జగన్ ఢిల్లీ ధర్నా తరువాత ఇండియా కూటమితో నడిచేందుకు సిద్ధమని చెప్పకనే చెప్పినట్లుగా ఉందని ప్రచారం అయితే సాగుతోంది. రానున్న కాలంలో అదే శ్రేయోదాయకం అని కూడా ఆయన భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. కాంగ్రెస్ ఉన్న ఇండియా కూటమిలో చేరి జాతీయ స్థాయిలో మద్దతు పొందుతూ ఇండియా కూటమి వేవ్ లో 2029లో ఏపీలో అధికారంలోకి రావచ్చును అన్నది వైసీపీ అధినాయకత్వం ఆలోచన అయితే అయి ఉండవచ్చు అని అంటున్నారు. అంటే కాంగ్రెస్ తో పొత్తుల దాకా వైసీపీ సుముఖంగా ఉంది అని అనుకోవాలి. అయితే కాంగ్రెస్ హై కమాండ్ కి మాత్రం ఇలాంటి ప్రతిపాదనలు నచ్చుతాయా అన్నదే పెద్ద చర్చగా ఉంది అంటున్నారు. ఏపీలో కాంగ్రెస్ బలం పుంజుకోవడం ఎంత అవసరమో పార్టీని మళ్లీ గద్దెనెక్కించడం కూడా అంతే ముఖ్యమని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. అంటే ఏపీలో కాంగ్రెస్ పాలన 2029 లో మొదలు కావాలన్నదే ఆ పార్టీ ఆలోచన అని చెబుతున్నారు. వైసీపీ విషయంలో పొత్తుల కంటే విలీనానికే కాంగ్రెస్ పెద్దలు ఓటేస్తారు అని అంటున్నారు. వైసీపీని విలీనం చేసుకుంటేనే బెటర్ అని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. పొత్తుల పేరుతో పక్క వాయిద్యం గా ఉండడానికి కాంగ్రెస్ ఇష్టపడదు అని అంటున్నారు. ఏపీలో 2029 నాటికి వైసీపీతో పొత్తు లేకపోయినా బలమైన శక్తిగా కాంగ్రెస్ అవతరించే అవకాశాలు ఉంటాయని ఊహిస్తున్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ అప్పటికి పెరిగితే వైసీపీలోని వారు అంతా కాంగ్రెస్ చెంతకే చేరుతారు అన్న లెక్కలు అంచనాలూ కూడా ఉన్నాయని అంటున్నారు. అందువల్ల వైసీపీకి కొత్తగా ఊపిరి పోసేలా పొత్తులు ఎందుకు అన్నదే ఒక చర్చగా ఉందని ప్రచారంలో ఉన్న మాట. అయితే ఏపీలో వైసీపీ ఉనికిని కాపాడుకోవడం కోసం పొత్తుల దాకా వెళ్తోంది అన్న ప్రచారం ఊపందుకున్న వేళ అది కాస్తా విలీనం దిశగా అడుగులు పడేలా చేస్తుందా అన్నదే మరో పుకార్ల లాంటి వార్తగా ఉంది. మరి ఏమి జరుగుతుందో తెలియదు కానీ ఏపీ మీద చాలా తొందరలోనే కాంగ్రెస్ పూర్తిగా ఫోకస్ పెడుతుందని అంటున్నారు. అపుడే ఈ ప్రచారాలలో ఏవి నిజాలు అన్నవి తెలుస్తాయని అంటున్నారు.

# శామీర్ పేట పంచాయతీని తూంకుంట మున్సిపల్లో విలీనం చేస్తే ఉద్యమమే



శామీర్ పేట, (గరుడ వార్త) : దశాబ్దాల చరిత్ర కలిగిన శామీర్ పేట పంచాయతీని తూంకుంట మున్సిపల్ లో విలీనిం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని బీజేపీ నాయకుడు సుధర్శన్ హెచ్చరించారు. బుధవారం శామీర్ పేటలో బీజేపీ నాయకుడు సుధర్శన్ నాయకత్వంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వం శామీర్ పేట పంచాయతీని తూంకుంట మున్సిపల్ లో విలీనం చేయటాన్ని బీజేపీ ఆధ్వర్యంలో తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. శామీర్ పేట పంచాయతీ కి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు ఉందని, అట్టి చరిత్రను ప్రభుత్వం తుడిచి వేయడానికి పక్రియను ఆరంభిం చడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు. గత దివంగత ముఖ్యమంత్రి చెన్నారెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఘన చరిత్ర శామీర్ పేటకు ఉందని వివరించారు. ఇంత చరిత్ర కలిగిన శామీర్ పేట పంచాయతీని తూంకుంట మున్సిపల్లో విలీనం చేయడానికి ప్రభుత్వం ప్రక్రియను మొదలు పెట్టడం సమం జసం కాదనన్నారు. దీన్ని శామీర్ పేట ప్రజలు రాజకీయ పార్టీలకతీతంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వివరించారు. శామీర్ పేట మండలంలోని స్థానిక కాం గ్రెస్ నాయకులు ఈ విషయంలో వెంటనే స్పందించి శామీర్ పేట పంచాయతీని తూంకుంట మున్సిపల్లో వివీలనం చేయకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

విలీనం రద్దు చేయించి ప్రత్యేకంగా శామీర్ పేట ను కొత్తగా మున్సిపల్ ను ఏర్పాటు చేసి చుట్టు ఉన్న గ్రామాలను శామీర్ పేట లో విలీనం చేసేందుకు అవ సరమైన చర్యలను తీసుకునేలా చోరవ తీసుకోవాలని, ఈ విషయాన్ని రాష్ట్ర సీఎం రేవంరెడ్డి దృష్టికి తీసుకెళ్ళాలని ఆయన డిమాండ్ చేశారు. శామీర్ పేట పంచాయతీని తూంకుంట మున్సిపల్లో విలీనం చేస్తే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నాయకత్వం లో రాష్ట్రర స్థాయిలో పెద్ద ఎత్తున వ్యతిరేక ఉద్యమాన్ని చేస్తామని బీజేపీ నాయకుడు సుధర్శన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# మానవ హక్కులపై ప్రతి ఒక్కరికి ఎంతగానో అవగాహన అవసరం

### శామీర్ పేట, మూడు చింతలపల్లి తాహసిల్దార్ లు యాదగిరిరెడ్డి, వెంకట నర్సింహారెడ్డి




శామీర్ పేట (గరుడ వార్త) : మానవ హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహసిల్దార్లు యాదగిరి రెడ్డి, వెంకట్ నరసింహారెడ్డిలు అన్నారు. బుధవారం శామీర్ పేట మండలం మజీద్ పూర్, మండల కేంద్రం మూడు చింతలపల్లిలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనిచివేతకు గురయ్యే పౌరుల కొరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల రక్షణ కొరకే రాజ్యాంగం, చట్టాలు ఉన్నాయని తెలిపారు. ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహణ కలిగి ఉండాల సూచించారు. ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందని చెప్పారు. ప్రజలు ముఖ్యంగా చట్టాలపై దృష్టి పెట్టవలసిందిగా ప్రతి పౌరుడికి న్యాయ చట్టాల విషయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో శామీర్‌పేట, మూడుచింతలపల్లిల ఎంపిడిఓ లు మమతా బాయి, వత్సలదేవి, ఆర్ఐ కుమార్, ఏఎస్ఐలు అమృత, నానునాయక్, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్, మాజీ సర్పంచ్ జామ్ రవి, వివిధ పార్టీల నాయకులు తుంకి మల్లేష్, కైరా యాదగిరి, అబ్బగౌని భాస్కర్ గౌడ్, సామల జశ్వంత్ రెడ్డి, తుంకి బిక్షపతి, తుంకి రమేష్, అబ్బగౌని వీరయ్య గౌడ్, తాడెం కుమార్, నాటకారి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం పంపిణీపై సర్వే



గంభీరావుపేట : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా, లబ్ధిదారులకు పక్కాగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపడుతుంది. దీని ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం వంటివి అందడంతో పాటు తీవ్ర పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రతి నెలా బరువు, ఎత్తు వంటివి గమనించనున్నారు. ఇందు కోసం ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) పేరిట సర్వేను మార్చి నెల నుంచి చేపడుతుంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సర్వే చేయాల్సిన కుటుంబాలు 1,36,722 ఉండగా, ప్రస్తుతం 1,21,086 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. 88.56 శాతం సర్వే పూర్తయింది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను చరవాణిలో ఉన్న యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటి యజమానితోపాటు కుటుంబ సభ్యులు ఎంత మంది ఉన్నారు, వారి వయసు, ఆధార్ నంబరు, పుట్టిన తేది తదితర వివరాలను నమోదు చేస్తున్నారు.

ఎన్నికలతో ఆలస్యం

సర్వేలో భాగంగా గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులు, దివ్యాంగుల వివరాలను సైతం పొందుపరుస్తున్నారు. సర్వేను మార్చిలోనే ప్రారంభించినప్పటికీ అంగన్‌వాడీ కార్యకర్తలు బీఎల్‌వోలుగా విధులు నిర్వహించడం వల్ల జాప్యం చోటుచేసుకుంది. సర్వే పూర్తి చేసి వివరాలు అందించాలని జిల్లా అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు. దీంతో జిల్లా అధికారులు శతశాతం పూర్తయ్యే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వేగవంతంగా వందశాతం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇవ్వాల్సిన పాలు, కోడి గుడ్లు, బాలామృతం వంటి పోషకాహారం పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట వేయడానికి సర్వే ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఇకపై లబ్ధిదారులకు పక్కాగా చేరుతుందని చెబుతున్నారు. గర్భిణులు రెండు చోట్ల పౌష్టికాహారం తీసుకోకుండా సర్వేతో అడ్డుకట్ట పడుతుంది.

శతశాతం పూర్తయ్యేలా చర్యలు– లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

జిల్లాలో ఎన్‌హెచ్‌టీఎస్ సర్వే మార్చి నెల నుంచి చేపడుతున్నాం. మధ్యలో ఎన్నికలు రావటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు బీఎల్‌వోలుగా విధులు నిర్వహించటంతో కొంత మేరకు ఆలస్యం జరిగింది. 90 శాతం వరకు పూర్తి చేశాం. సర్వేపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. వారికి ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తున్నాం. త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలను జారీ చేశాం. వారం రోజుల్లో పూర్తి చేస్తారు.

# హడలెత్తిస్తున్న శునకాలు.. జంకుతున్న జనాలు

ఎడపల్లి: పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పిల్లలు మొదలుకుని పెద్దల వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం ఎవరో ఒకరు శునకాల దాడికి గురవుతూనే ఉన్నారు. బాధితుల్లో కొందరు యాంటీ రేబిస్ టీకాల కోసం సమీప ప్రభుత్వ దవాఖానాలకు పరుగులు తీస్తుండగా.. మరికొందరు అవగాహన లోపంతో అందుబాటులో లభించే నాటుమందు తీసుకుంటున్నారు. ఒక్క బోధన్ డివిజన్‌లోనే గత మే నెలలో 168 కేసులు నమోదయ్యాయి.

మాంసానికి అలవాటు పడి..

ప్రస్తుతం ప్రతి గ్రామంలో కోడి మాంసం దుకాణం అందుబాటులోకి వచ్చింది. నిర్వాహకులు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తుండటంతో కుక్కలు మాంసానికి అలవాటు పడుతున్నాయి. వ్యర్థాలు దొరకని సమయంలో ప్రజలపై దాడులు చేస్తున్నాయి. వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై



ఉంది. ఔషధాలు అందుబాటులో ఉన్నాయి

విద్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, బోధన్

బోధన్ డివిజన్‌లోని ప్రభుత్వ దవాఖానాల్లో యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉన్నాయి. కుక్కల దాడిలో గాయపడ్డ వారందరికీ సిబ్బంది సకాలంలో టీకాలు వేసి చికిత్స అందిస్తున్నారు. ఎక్కడ కూడా మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

బోధన్ డివిజన్‌లోని దవాఖానాల్లో గత నెలలో నమోదైన కుక్కకాటు కేసులు : బోధన్ : 144 పెగడాపల్లి : 4 రెంజల్ : 5 ఎడపల్లి : 6 వర్ని : 4 రుద్రూరు : 4

నియంత్రణ కరవు..పట్టణాలు, పల్లెల్లో శునకాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి. కానీ ఆచరణలో ఇది మచ్చుకైనా కనిపించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెంపుడు, వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయాలి. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు లేవని చెప్పొచ్చు. రోజురోజుకూ కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. నియంత్రణ లేకపోవడంతో శునకాలు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి.

గత నెల 21న కుర్నాపల్లిలో ఆడుకుంటున్న 12 ఏళ్ల బాలికపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. క్షతగాత్రురాలిని నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు.

జూన్ 8న జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలం చాంద్‌మియాబాగ్ పంచాయతీలో ఓ బాలుడిపై శునకం దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. మరోవైపు ఇతర ప్రాంతాల్లో శునకాలు చేసిన దాడుల్లో ఇద్దరు బాలురు మృతిచెందారు. ఈ నెల 5న హైదరాబాద్ మియాపూర్‌లో ఆరేళ్ల బాలుడు ఆడుకోవడానికి వెళ్లగా శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో బాలుడు మృతి చెందారు. 8న జనగామ జిల్లా చిల్పూర్ శివారులో ఆడుకోవడానికి వెళ్లిన ఆరేళ్ల బాలుడిని శునకాలు పొలాల్లోకి ఈడ్చుకెళ్లి దాడి చేయగా.. బాలుడు చనిపోయాడు.

# రూ. కోట్లలో అక్రమం.. నోటీసులతో తాత్సారం

నిజామాబాద్: జిల్లాలోని సహకార సంఘాల్లో నిధుల దుర్వినియోగం వ్యవహారాలు ఏటా వెలుగుచూస్తున్నాయి. అనేక చోట్ల పాలకవర్గాలు ఇష్టారాజ్యంగా అక్రమాలకు తెర లేపాయి. నిర్మాణాల పేరిట అధిక వ్యయాలు చేసి దండుకున్నట్లు కొన్నిచోట్ల బయటపడితే.. పంట రుణాల బకాయిలు చెల్లించిన రైతులకు నకిలీ రసీదులిచ్చి.. ఆ డబ్బును సంఘం ఖాతాలో జమ చేయకుండా బొక్కేశారు. ఎరువులు విక్రయించగా వచ్చిన డబ్బును సైతం సొంతానికి వాడేసుకున్నట్లు ఆడిట్లలో వెలుగుచూసింది. గత అయిదేళ్లలో 23 సొసైటీల్లో అక్రమాలు జరిగాయి. ఈ ఏడాదిలోనే నాలుగు సంఘాలకు నోటీసులు జారీ అయ్యాయి. నిధుల దుర్వినియోగంతో సొసైటీలు అప్పుల ఊబిల్లో కూరుకుపోతుండగా.. వాటిని రికవరీ చేయడంతో సహకార శాఖ న్యాయపరమైన చిక్కులతో పాటు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది.

పలుకుబడితో నెట్టుకొస్తూ..

జిల్లాలోని సహకార పలు సొసైటీల్లో వెలుగుచూసిన ఉదంతాల్లో రూ.కోట్లల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. మొదట్లో వేలు, లక్షల్లో ఉన్న అక్రమాలు, ఇప్పుడు రూ.కోట్లను చేరుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఏళ్ల తరబడిగా నిధుల వినియోగంపై విషయాలు బయటకు రాకుండా తమ పలుకుబడితో నెట్టుకొచ్చారు. ఆడిట్ చేసిన అధికారులను మచ్చిక చేసుకొని లోలోపల విషయాలు సర్దుబాటు చేసుకుంటూ వెళ్లారు. పెద్ద మొత్తంలో దుర్వినియోగం విషయాలు గుర్తించిన ఆడిట్ అధికారులు.. తమ మెడకు చుట్టుకుంటుందనే భయంతో వెలుగులోకి తెచ్చిన పరిస్థితి. బాధ్యులను గుర్తించి సర్‌ఛార్జి నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం 11 చోట్ల విచారణ పూర్తయి.. సొత్తు వివరాలతో సర్‌ఛార్జి నోటీసులు జారీ చేసిన పరిస్థితి.

అప్పుల ఊబిలో మరికొన్ని..

అక్రమాలు వెలుగు చూసి కొన్ని సొసైటీలు అభాసుపాలైతే.. మరికొన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాల్లో ఉన్నాయి. జిల్లాలోని 13 సహకార సంఘాలు మార్క్‌ఫెడ్‌కు రూ.7 కోట్ల వరకు బకాయిలున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎరువులు అరువుగా దిగుమతి చేసుకొని.. వాటిని రైతులకు అమ్ముకున్నాయి. వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చకుండా.. ఇతర అవసరాలకు వాడేశాయి. దీంతో ఇప్పుడు మార్క్‌ఫెడ్ నుంచి ఎరువులు దిగుమతి చేసుకోలేని పరిస్థితి. దీనికితోడు ఆయా సొసైటీల అప్పుల విషయంలో మార్క్‌ఫెడ్ అర్బిట్రేషన్‌కు వెళ్లింది. ఈ వివాదాలను పరిష్కరించడానికి ఇద్దరు అధికారులను నియమించారు. అప్పులు నిజమే అని తేలిన క్రమంలో రికవరీ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. పాలకవర్గాలు తీసుకుంటున్న నిర్ణయాలు.. చేస్తున్న వ్యయాలపై నిరంతర పర్యవేక్షణ, ఆడిట్ ఉండకుంటే ఇలాంటి పరిస్థితులే ఎదురవుతుంటాయి. సంఘాలు అప్పుల్లో ఉన్నా.. నిధుల దుర్వినియోగం జరిగిన ఆ ప్రాంత రైతులకు అందే సేవలపై ప్రభావం పడుతుంది.

రికవరీలో అవరోధాలు

రికవరీ చట్టాన్ని వినియోగించి అక్రమాలకు బాధ్యుల నుంచి సొమ్ము రాబట్టాలి. కానీ ఆయా సంఘాల్లో ఛైర్మన్లుగా చేసిన వారు రాజకీయ పలుకుబడితో అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి.. ఎప్పటికప్పుడు తప్పించుకుంటున్నారు.

# ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు..!

సిరిసిల్ల : వానాకాలం మొదలైందంటే చాలు దోమల విజృంభన అధికమవుతుంది... కునుకు తీద్దామంటే చెవుల వద్ద విసుగు పుట్టే శబ్దాలతో నిద్రపోనివ్వవు. మన రక్తాన్ని పీలుస్తూ వ్యాధులను వ్యాపింపజేస్తాయి. మురుగు కాల్వలు, అపరిశుభ్ర ప్రాంతాలతో పాటు ఖాళీ స్థలాలు దోమల పుట్టుకకు నిలయాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నా ఎవరూ దీనిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇళ్ల మధ్యన మురుగు, అపరిశుభ్ర వాతావరణ నెలకొని దోమల వ్యాప్తి అధికమవుతోంది. జిల్లా కేంద్రమైన సిరిసిల్లలో రోజురోజుకూ జనాభా పెరుగుతోంది. పల్లెల నుంచి పట్టణాలకు ఉపాధికి కోసం వస్తున్నారు... ఇక్కడే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కావడంతో భూముల ధరలుసైతం పెరిగాయి. చుట్టుపక్కన పల్లెల నుంచి వచ్చేవారు జిల్లా కేంద్రంలో నివసించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇలా చాలామంది ఇంటి నిర్మాణానికి స్థలాలను కొనుగోలు చేశారు. కొంతమంది భవనాలు నిర్మిస్తే చాలా కాలనీల్లో స్థలాలను ఖాళీగా వదిలేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఖాళీ స్థలాల్లోకి వ్యర్థాలు చేరి మురుగు కూపాలను తలపిస్తున్నాయి. వీటిని ఆవాసాలుగా చేసుకొని దోమలు తమ సంతతి పెంచుకుంటున్నాయి. సాయంత్రం అయిదు దాటితే చాలు ఇళ్లలో దోమల బాధతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. మురుగు కాల్వలు సరిగా లేక సంజీవయ్యనగర్, అంబికానగర్, వెంకంపేట, సర్దార్‌నగర్, అసీఫ్‌పురా, ఆటోనగర్, తారకరామనగర్, పద్మనగర్, అశోక్‌నగర్, శాంతినగర్‌లో వరదనీరు భారీగా చేరుతోంది.

ప్రత్యేక శ్రద్ధ అవసరం...

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతీ నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. నాలుగు ఫాగింగ్ యంత్రాలు ఉండగా రెండు పాడైపోయాయి. ఈ సీజన్‌కు సరిపడా బ్లీచింగ్‌ను అధికారులు సమకూర్చారు. పట్టణంలోని 80 మంది భూ యజమానులకు వారి ఖాళీ స్థలాలను శుభ్రపరచాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు 30 మంది నోటీసులకు స్పందించినట్లు అధికారులు చెబుతున్నారు. నోటీసులకు స్పందించే వారు చాలా తక్కువమంది ఉంటున్నారు. ఆయా స్థలాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి యజమానులకు జరిమానా విధించే అవకాశం ఉన్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సరైన మురుగునీటి పారుదల లేకపోవడం, అరకొర పారిశుద్ధ్య పనులతో సమస్య పరిష్కారం కావడం లేదని పలువురు అంటున్నారు. ఏటా సీజన్‌లో తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు తప్ప ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు.

అవగాహన కల్పిస్తున్నా...

జిల్లా కేంద్రంలో వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇళ్లలో పాత టైర్లు, పడేసిన కొబ్బరిబోండాలు, పూల కుండీలు పనికి రాని వస్తువులను గుర్తిస్తున్నారు. వైద్య బృందంతో కలిసి ఇంటింటి సర్వే చేపడుతున్నారు. డ్రైడే ఆవశ్యకతపై వివరిస్తున్నారు. వరదనీరు ఆగిన చోట జేసీబీలతో కచ్చాకాల్వలు తీయిస్తున్నారు. నెల రోజులుగా డివిజన్ల వారీగా ఫాగింగ్ చేయిస్తున్నారు. ఖాళీస్థలాల్లో నిల్వనీరు లేకుండా చూడాలని వివరిస్తున్నా పలువురు దీనిని పట్టించుకోవడం లేదు.

విపరీతంగా పెరిగాయికాలనీలో దోమలు విపరీతంగా పెరిగాయి. సాయంత్రం అయితే తలుపులు తెరిచి ఉంచే పరిస్థితి లేదు. వర్షాకాలంలో మా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటుంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే ఇబ్బందులు మరింతగా పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి నీరు నిల్వఉండకుండా చర్యలు చేపట్టాలి.

ముద్దం శ్రీనివాసగౌడ్, సంజీవయ్యనగర్

నోటీసులు జారీ చేశాం

పట్టణంలోని ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు అందించాం. నీటి నిల్వ ప్రదేశాల్లో ఆయిల్‌బంతులు వేస్తున్నాం. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేస్తూ బ్లీచింగ్ చల్లించేలా చర్యలు చేపడుతున్నాం. నోటీసులకు స్పందించకుంటే ఖాళీ స్థలాలను మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించి ఇంటి అనుమతులకు వచ్చిన సమయంలో ఆ రుసుము చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.

లావణ్య, మున్సిపల్ కమిషనర్

# తలసరి ఆదాయం మెరుగు



పెద్దపల్లి : ఉమ్మడి జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. తలసరి ఆదాయం, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి హామీ, సేవ తదితర రంగాల్లో ముందు వరసలో నిలుస్తోంది. అక్షరాస్యత, వృద్ధి రేటులో ఆశించిన ప్రగతి ఉన్నప్పటికి కొన్నింటిలో వెనకబడి ఉంది. తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే–24లో ఉమ్మడి జిల్లా పురోగతి ఇలా.

**స్వల్పంగా వృద్ధి**

అన్ని రకాల వస్తువులు, సేవల రూపంలో వచ్చే ఆదాయాన్ని జిల్లాలోని పౌరులందరికీ విభజిస్తే ఒక్కో పౌరుడి వాటాను జిల్లా తలసరి ఆదాయంగా లెక్కిస్తారు. రాష్ట్ర తలసరి ఆదాయం సగటు రూ.3,11,649తో పోల్చితే ఉమ్మడి జిల్లాలో తక్కువ ఉన్నప్పటికి గతేడాదితో పోల్చితే మాత్రం స్వల్పంగా పురోగతి ఉంది. పెద్దపల్లి జిల్లాలో ప్రజల ఆదాయం నెలవారీగా చూస్తే ఒక్కొక్కరు రూ.19,313 సంపాదిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో తక్కువగా రూ.15,257 ఆర్జిస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం

ఉమ్మడి జిల్లాలో బొగ్గు గనులు, ఎన్టీపీసీ, గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) మొత్తం కలిపి 86,552 ఉండగా నాలుగు జిల్లాల్లో కరీంనగర్ ప్రథమ, రాజన్న సిరిసిల్ల చివరి స్థానాల్లో నిలిచాయి. వరి, పత్తి, పసుపు, మామిడి దిగుబడులు, అపారమైన వనరులు ఉన్నప్పటికి ఆహారశుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

తక్కువ రహదారుల జిల్లా పెద్దపల్లి

రహదారి సగటును పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో పెద్దపల్లి అతి తక్కువ రహదారులు ఉన్న జిల్లాగా నమోదైంది. వంద చదరపు కిలోమీటర్లకు రాష్ట్ర సగటు 98.8 కి.మీ.లు ఉండగా పెద్దపల్లి జిల్లాలో 97.2 కి.మీ.ల పొడవునా ఉండి స్వల్పంగా తగ్గింది. అత్యధిక రహదారుల సాంద్రత కలిగిన జిల్లాగా కరీంనగర్ 137.4 కి.మీ అగ్రస్థానంలో నిలిచింది.

నాలుగు జిల్లాల పరిధిలో ప్రజలకున్న సగటు భూమి పరిశీలిస్తే రాజన్న సిరిసిల్లలో అత్యధికంగా సగటు భూమి కలిగి ఉన్నట్లు తేలింది. ఒకరికి సగటున 2 ఎకరాల పైన భూమి ఉంది. కరీంనగర్‌లో 1.80 ఎకరాలు కలిగి ఉన్నట్లు తేలింది.

జాతీయ ఉపాధి హామీలో రాజన్న సిరిసిల్ల జిల్లా హవా కొనసాగింది. ఏడాదిలో 17.6 లక్షల పనిదినాల లక్ష్యంగా ఉండగా 34.6 లక్షల పనిదినాలు పూర్తి చేసి ప్రథమంగా నిలిచింది.

వ్యవసాయ కూలీలు అధికమే

వ్యవసాయ రంగంలో ఉమ్మడి జిల్లా అగ్రగామిగా నిలుస్తున్నప్పటికి రైతుల కంటే వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్నారు. నాలుగు చోట్లా ఇదే పరిస్థితి. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా ఉన్నట్లు నమోదైంది.

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు షురూ

భువనగిరి : గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమీక్షలో అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ దిశగా ఏర్పాట్లను మొదలు పెట్టింది. గ్రామ పంచాయతీల్లో వార్డు మ్యాపింగ్, వార్డుల వారీగా ఓట్ల జాబితా తయారీ కోసం డాటా ఎంట్రీ ఆపరేటర్ల(డీఈవో) శిక్షణ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ప్రతి జిల్లా నుంచి ఐదుగురు ఆపరేటర్లకు హైదరాబాద్‌లోని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ)లో శిక్షణ అందించనుంది. వీరు తిరిగి ఆయా జిల్లాలోని మండలాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తర్ఫీదు అందించాల్సి ఉంటుంది.

**పేరుకుపోయిన సమస్యలు**

గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 1న సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. అదే నెల 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. ప్రత్యేక అధికారులు తమ శాఖపరమైన సొంత విధులతో పాటు పంచాయతీల్లో సర్పంచుల




స్థానంలో అదనంగా పనిచేయాల్సి రావడంతో పాలన పట్టుతప్పింది. ఒక్కో అధికారికి నాలుగైదు పంచాయతీలు అప్పగించడంతో వీరు గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. దీంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. పంచాయతీలకు సకాలంలో నిధులు అందడం లేదని, నిర్వహణ ఖర్చుల కోసం అప్పులు తెస్తున్నామని ఇటీవల ప్రజావాణిలో పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాలు అందజేయడం గమనార్హం. పాలకవర్గాలు ఉంటే వెనువెంటనే సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది.

**3 నుంచి శిక్షణ** నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల ఆపరేటర్లకు ఆగస్టు 3న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ ఎంసీఆర్ హెఆర్డీలో శిక్షణ ప్రారంభం కానుంది. ఇందుకు జిల్లాకు ఐదుగురు ఆపరేటర్లను ఎంపిక చేసి ఈనెల 31న పంపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల తాజా ఓటర్ల జాబితా నుంచి గ్రామాల్లోని వార్డుల వారీగా పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎన్నిక సంఘం సూచించింది.

# స్థాయి పెరిగినా సేవలు అంతంతే!



ధర్మపురి : ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి స్థాయి మారిన సదుపాయాలు కరువయ్యాయి. సరిపడా వైద్యులు, పరికరాలు లేకపోవడంతో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. మొదట 8 పడకలు.. ఆ తర్వాత 20 పడకలకు.. కొన్నేళ్లకు 30 పడకలకు.. 2023లో గత ప్రభుత్వం వైద్య శాఖ నుంచి వైద్య విధాన పరిషత్తుకు మార్పు చేసి 50 పడకలకు ఆస్పత్రి స్థాయిని పెంచింది. క్యాడర్ స్ట్రెంతు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు రెండేళ్ల నుంచి కొలిక్కి రావడం లేదు. దవఖానాలో 53 వైద్యుల పోస్టులకు 23 మందినే కేటాయించారు. వీరిలో కేవలం 8 మంది మాత్రమే పనిచేస్తున్నారు. చిత్రమేమిటంటే ఈ 8 మందిలోనూ ఇద్దరు డిప్యూటేషన్‌పై ఇతర ఆసుపత్రులకు వెళ్లారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఉన్నవారు ప్రతిరోజు ఉదయం 10 గంటలకు వచ్చి.. మధ్యాహ్నం 2 గంటలకు వెళ్లిపోతున్నారు. అత్యవసర కేసులకు ఒకరిద్దరు వైద్య సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఈ ఆస్పత్రిని ఇటీవల కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేసి.. సేవలు విస్తరించాలని ఆదేశించారు.

**సిబ్బంది.. పరికరాల కొరత**

రెండు ఫార్మాసిస్టు పోస్టులకు ఒకరే ఉండగా, మరొకరు డిప్యూటేషన్‌పై వేరేచోట పనిచేస్తున్నారు. రక్తపరీక్షలు చేసేందుకు ట్యాబ్ టెక్నీషియన్‌లు ఇద్దరు అవసరం కాగా.. ఒకరే ఉన్నారు. ప్రస్తుతం జ్వరాల ప్రబలే అవకాశం ఉండటంతో ఒక్కడిపైనే పనిభారం పడుతోంది.

ఎక్స్‌రే ప్లాంటు.. రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రూ.5 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వం 10 ఐసీయూలను మంజూరు చేసి పరికరాలను కూడా పంపించింది. అయితే సగం వరకు మాత్రమే వచ్చాయి. మిగతా సగం నిలిచిపోయాయి. సిబ్బంది నియామకంలో కూడా జాప్యం జరుగుతోంది.

త్వరలోనే అన్ని పోస్టులు భర్తీ అవుతాయి

ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరిస్తూనే వైద్య సేవలందిస్తున్నాం. త్వరలోనే అన్ని పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైద్యులు సకాలంలోనే హాజరై సేవలందిస్తున్నారు. డా.శ్రీకాంత్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, ధర్మపురి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి

# అత్యవసర సేవలకు అవస్థలు

నర్సాపూర్: ఆపద సమయాల్లో క్షతగాత్రులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లే అంబులెన్స్‌లు దుస్థితికి చేరాయి. డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఒక అంబులెన్స్ పూర్తిగా పాడవడంతో పక్కనపెట్టారు. మరోటి తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఈ స్థితిరో రోగులు ప్రైవేటు వైపు మొగ్గు చూపడంతో వారు రోగుల అవసరాలను బట్టి అందినంత దండుకుంటున్నారు.

నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు రెండు దశాబ్దాల క్రితం కేటాయించిన అంబులెన్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దానిని తిప్పడం లేదు. ఆసుపత్రి ఆవరణలోనే నిరుపయోగంగా ఉంచుతున్నారు. దీనికి మరమ్మతులు చేసినా డబ్బులు వృథా అని వాడటం లేదు. దీంతో అది కాస్త తుప్పు పట్టి పాడైపోతోంది. నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నా వేలం వేయడం లేదు. తుక్కుకింద మారకముందే అమ్మేస్తే ఎంతో కొంత ఆసుపత్రికి లాభం చేకూరుతుందని పట్టణవాసులు చెబుతున్నారు. ఆసుపత్రికి మరో అంబులెన్స్ వచ్చి ఎనిమిదేళ్లవుతోంది. గతంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తన నిధుల నుంచి దీనిని కేటాయించారు. ఇప్పటివరకు 2 లక్షల కిలోమీటర్లు తిప్పారు. దీంతో ఇది కాస్త తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**సంగారెడ్డి, హైదరాబాద్‌లకు..**

నర్సాపూర్ ఆసుపత్రి నుంచి నిత్యం సంగారెడ్డి, హైదరాబాద్‌లోని కార్పొరేట్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను అత్యవసర పరిస్థితుల్లో తరలిస్తుంటారు. ఈ అంబులెన్స్‌కు




వాహనచోదకుడు మినహా ఇతర సిబ్బంది నియామకం ఇంతవరకు చేపట్టలేదు. రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు, ఆత్మహత్యాయత్నాలు తదితర సమయాల్లో వచ్చే రోగులను అత్యవసరమైతే మెరుగైన చికిత్సకు హైదరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మెదక్–నర్సాపూర్–హైదరాబాద్, సంగారెడ్డి–నర్సాపూర్–తూప్రాన్ రెండు జాతీయ రహదారులతో పాటు, ఇతర గ్రామాల రోడ్లపై కూడా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సమయానికి అంబులెన్స్ సేవలు అందకపోవడంతో ఆసుపత్రి ఆవరణలో నిలుపుతున్న ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతి ఒక్కటి కూడా సరైన సేవలందించకపోవడంతో రోగులపై ఆర్థిక భారం పడుతోంది.

**ప్రతిపాదనలు పంపాం**

పావని, ఆసుపత్రి పర్యవేక్షకురాలు

ఒక అంబులెన్స్ పాడవడంతో వినియోగించడం లేదు. మరోటి తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఇటీవల కొత్తదానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. వంద పడకల ఆసుపత్రికి తగ్గట్లుగా మరో అంబులెన్స్ కేటాయిస్తే రోగులకు మేలు జరుగుతుంది.

# శిక్షణ గుహాలు..

హైదరాబాద్: ఒకరు మాత్రమే నడవ గలిగే మెట్ల మార్గంతో మూడు, నాలుగు అంతస్తుల్లో శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి. వాటిలో రోజూ వేలాది మంది విద్యార్థులకు శిక్షణ తరగతులు నడుస్తున్నాయి. ఒక మంచం పట్టే గదిలో 20 కుర్చీలతో ప్రైవేటు లైబ్రరీలు కొనసాగుతున్నాయి. వాటికి అనుమతుల్లేవు. భద్రత డొల్ల. మంచి గాలి, వెలుతురనే ప్రశ్నే ఉండదు. ఆర్టీసీ క్రాసురోడ్డులోని అశోక్‌నగర్‌లో కనిపించే దారుణ దృశ్యాలివి. దిల్లీలో తాజాగా కురిసిన వర్షాలకు.. ఓ ఐఏఎస్ శిక్షణ కేంద్రం లైబ్రరీలోకి నీరు చేరి, అందులో చదువుతున్న ముగ్గురు శవాలై తేలడంతో.. అశోక్‌నగర్‌లోని దారుణ పరిస్థితులు మళ్లీ చర్చకొచ్చాయి. డబ్బు కోసం కక్కుర్తి..ఒకప్పుడు అశోక్‌నగర్‌లో నివసించేందుకు చాలా మంది ఆసక్తి చూపేవారు. ఇప్పుడు అక్కడున్న ఇళ్లన్నీ శిక్షణ కేంద్రాలుగా, హాస్టళ్లుగా, స్టడీ హాళ్లుగా మారుతున్నాయి. కాసులకు



కక్కుర్తి పడుతూ.. చిన్న చిన్న ఇళ్లను శిక్షణ కేంద్రాలుగా, వసతి గృహాలుగా, లైబ్రరీలుగా మార్చుతున్నారు. ఓ శిక్షణ కేంద్రంలో పాఠం వినేందుకు 500ల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. కుర్చీలన్నీ ఒకదాని వెనుక ఒకటి ఏర్పాటై ఉంటాయి. ఒకసారి కూర్చున్నారంటే.. తరగతి పూర్తయి అందరూ వెళ్లే వరకు కదల్లేని పరిస్థితి. అందరికీ ఒకే మరుగుదొడ్డి. ఒకే మెట్ల మార్గం.పార్కింగ్ వసతి ఉండదు. ఇళ్లను ప్రైవేటు స్టడీ హాళ్లుగా మార్చి.. చిన్న చిన్న గదుల్లో 20కి తగ్గకుండా కుర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి పలు శిక్షణ కేంద్రాల్లో ఏదేనీ ప్రమాదం చోటుచేసుకుంటే.. ఇరుకైన మెట్ల మార్గాల వల్ల తొక్కిసలాట జరుగుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భారీ వర్షంతో అశోక్‌నగర్‌లోని రోడ్లపై నడుముల్లోతున నీరు నిలిచిందని, రెండు గంటలపాటు శిక్షణ కేంద్రాల్లోని విద్యార్థులంతా లోపలే ఉండి పోయారని గుర్తు చేస్తున్నారు.

# అభివృద్ధి సూచి.. భవిత దిక్సూచి..

సంగారెడ్డి :ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వనరులకు కొరత లేదు. యువత అధికంగానే ఉన్నారు. వనరుల సద్వినియోగంతో పాటు యువతకు సరైన అవకాశాలు కల్పిస్తే ప్రగతి సాధ్యమన్నది నిపుణుల మాట. అందుబాటులో ఉన్న వనరుల వినియోగమే ప్రధానం. తెలంగాణ సామాజిక ఆర్థిక, సామాజిక నివేదిక–2024 ఇదే విషయాన్ని వెల్లడిస్తోంది. ఆయా సమస్యలు అధిగమిస్తే నాలుగు జిల్లాలు పురోగతిలో దూసుకెళ్లడం ఖాయం. ఈ నేపథ్యంలో అంశాల వారీగా ప్రగతి, తదితర వివరాలపై కథనం.

**సంగారెడ్డిలో అబ్బాయికి పెళ్లి కావడం కష్టమే..**

సంగారెడ్డి జిల్లాలో అబ్బాయికి పెళ్లి కావడం కాసింత కష్టమే. సామాజిక ఆర్థిక సర్వే దీన్నే సూచిస్తోంది. ఇక్కడ పురుషులు మహిళల కంటే అధికంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఇప్పటికే అమ్మాయిలు సరిగా దొరక్క అబ్బాయిల తల్లిదండ్రులు పాట్లు పడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లో మరింత ఎక్కువగా కనిపిస్తోంది. సిద్దిపేట, మెదక్, వికారాబాద్ జిల్లాలు మాత్రం మెరుగ్గానే ఉన్నాయి. మహిళల అధిపత్యమే కనిపిస్తోంది.

**కూలీలకు ఉపాధి 'హామీ'** వలసలు నివారించి ఉన్న ఊళ్లోనే ఉపాధి కల్పించాలన్నది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం. ఈ పథకం కింద జాబ్ కార్డులు కలిగి ఉన్న వారికి ఏడాదిలో 100 పని దినాలు కల్పించాల్సి ఉంది. ప్రతి ఏటా జిల్లాలకు లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. గత ఆర్థిక సంవత్సరం ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాలోనూ శతశాతం లక్ష్యాలను అధిగమించారు.

**వ్యవసాయంతోనే జీవనయానం**

ఉమ్మడి మెదక్‌తో పాటు వికారాబాద్ జిల్లాల్లో అత్యధికులకు వ్యవసాయమే జీవనాధారం. గ్రామీణ జిల్లా వికారాబాద్‌లో రైతులు ఎక్కువ మంది ఉండటం గమనార్హం. వ్యవసాయ కూలీల విషయం వచ్చేసరికి సంగారెడ్డిలోనే అధికంగా ఉన్నారు. పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో సంగారెడ్డి జిల్లాలో కార్మికులు ఎక్కువగా ఉంటారనుకుంటాం. ఇక్కడ వీరిది రెండో స్థానం. సిద్దిపేటలో జలాశయాల నిర్మాణంతో సాగుకు ఊతమిచ్చినట్లయింది. ఆహార అనుబంధ రంగ పరిశ్రమలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటం సాగుకు మరింత ప్రోత్సాహం అందినట్లే.

**స్థూల ఉత్పత్తిలో** జిల్లాల ఆర్థిక వృద్ధి స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీపీ) ద్వారా తెలుస్తుం ది. వస్తువుల ఉత్పత్తి, సేవల విలువతో జీడీపీని లెక్కిస్తారు. ఇందులో సంగారెడ్డి జిల్లా ముందుంది. రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉండగా, సిద్దిపేట 11, మెదక్ 15, వికారాబాద్ 21వ స్థానంలో ఉన్నాయి. అధికారులు ప్రత్యేక చొరవ చూపి వస్తువుల తయారీని పరుగెత్తించాలి. తూప్రాన్, వర్గల్, సిద్దిపేట, తాండూరు తదితర చోట్ల పరిశ్రమల ఏర్పాటుకు వనరులు పుష్కలంగా ఉన్నాయి.

**సగం మంది దూరమే**

నాలుగు జిల్లాల్లో ఉన్న జనాభాలో సగం మంది మాత్రమే పనులు చేస్తుండటం గమనార్హం. మిగతా వారంతా పనులకు దూరంగా ఉంటున్నారు. ఇక సంగారెడ్డి జిల్లాలో అయితే 45.5 శాతం మందే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలకు కొదవ లేకపోయినా ఇలాంటి పరిస్థితి ఉండటం గమనార్హం. మిగతా మూడు జిల్లాల్లో కాస్త నయం. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**లెక్క భారీగానే..**ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సంగారెడ్డి ప్రజల తలసరి ఆదాయం పెరిగి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలవడం విశేషం. ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండటమే దీనికి ప్రధాన కారణం. అతిపెద్దదైన పారిశ్రామిక వాడ పటాన్‌చెరులో విస్తరించి ఉండటంతో పాటు జిన్నారం, జహీరాబాద్ ప్రాంతాల్లో పరిశ్రమలు వెలియడం కలిసొచ్చింది. హైదరాబాద్‌కు సమీపంలోని బీహెచ్‌ఈఎల్, అమీన్‌పూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు నివాసం ఉంటున్నారు. మూడేళ్లుగా తలసరి ఆదాయంలో పెరుగుదల కనిపిస్తోంది. మిగతా జిల్లాల్లో ఆశించిన స్థాయిలో లేదు. ఇక్కడి యువతకు ఉపాధి కల్పిస్తే మెరుగుపడుతుంది.

**అక్షరాస్యతే కీలకం** నాలుగు జిల్లాల్లోనూ అక్షరాస్యత రాష్ట్ర సగటు కంటే తక్కువగా ఉండటం గమనార్హం. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా ఈ అంశంలో వెనుకబాటు అభివృద్ధికి అవరోధంగా మారింది. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేసినా ఫలితాలు ఆ స్థాయిలో కనిపించలేదు. ప్రధానంగా వికారాబాద్, మెదక్ జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు నయమే. జిల్లాల యంత్రాంగం ఈ విషయమై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**మురుస్తున్న పల్లెలు..**

నాలుగు జిల్లాల్లో పట్టణాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. అయినా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికులు జీవనం సాగిస్తున్నారు. పట్టణాల్లో నివాసం ఉండాలంటే సంపాదన అదే స్థాయిలో ఉండాలి.

# పేరులేక.. పాలుపోక

తాండూరు : ప్రభుత్వం ఏకకాలంలో రూ.లక్ష రుణ మాఫీని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసింది. అన్నదాతలు సంబురపడ్డారు. తమ కష్టాలు కొంత మేరకైనా గట్టెక్కాయని భావించారు. కానీ కొందరు రైతుల వివరాలు జాబితాలో కన్పించడం లేదు. ఇదే సమయంలో రైతుల నుంచి బ్యాంకులు వడ్డీ వసూళ్లకు శ్రీకారం చుట్టాయి. దీంతో అన్నదాతలకు పాలుపోక వ్యవసాయ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు.

**మొత్తం రైతులు 2.75 లక్షలు**

జిల్లాలోని 20 మండలాల్లో 2.75లక్షల మంది రైతులున్నారు. ఇటీవల రూ.లక్షలోపు రుణాల్ని మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.గ్రామాల వారీగా మాఫీ అయిన రుణాలు, రైతుల వివరాలతో జాబితాలను విడుదల చేశారు. వాటిలో కొంతమంది అర్హులైన రైతుల వివరాలు లేవు. దీంతో తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి వ్యవసాయ కార్యాలయాలకు, రైతు వేదికల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు.తాండూరు మండలం చిట్టిగణాపూర్‌లో ఏకంగా 30 మందికిపైగా రైతుల పేర్లు గల్లంతయ్యాయి. ఆయా రైతులు తాండూరు వ్యవసాయ కార్యాలయానికి, బెల్కటూరు రైతు వేదిక వద్దకు వెళ్లి విస్తరణ అధికారి శ్రీనివాస్‌ను ఆరా తీశారు.అన్ని వివరాలను ఆరా తీస్తున్నామన్నారు. ఇలా రోజుకు కనీసం 10 దరఖాస్తులు వస్తున్నాయని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

**రోజుకు పదికిపైగా అర్జీలు..** రూ.లక్షలోపు రుణ మాఫీ వర్తించని రైతులు రోజుకు 10 మందికి పైగా మా వద్దకు వస్తున్నారు. రేషన్ కార్డులేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం వాటిని పరిశీలించి అర్హులైన వారికి మాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటాం. – రుద్రమూర్తి, ఏడీఏ, తాండూరు.



**ప్రభుత్వానికి వివరాలు పంపిస్తాం**

కొందరు రైతులు అర్హులైనప్పటికీ రుణమాఫీ లభించలేదు. ఇలాంటి రైతుల వద్ద ధృవపత్రాలు తీసుకొని ప్రభుత్వానికి పంపిస్తాం. అందరికీ అందేలా ప్రయత్నిస్తాం.

పావని, ఏఈవో, హస్నాబాద్.

**బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి పేరు రాలేదు..**

వ్యవసాయశాఖ, బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి ఎరుకలి ఆశప్ప, మల్లమ్మ పేర్లు రాలేదు. దీంతో వారికి రుణమాఫీ కాలేదు.

శ్రీనివాస్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్, హస్నాబాద్.

**ఆరునెలల వడ్డీ వసూలు చేస్తున్నారు..** ప్రభుత్వం రుణ మాఫీని డిసెంబరులో అమలు చేస్తానని ప్రకటించి ఆలస్యం చేసింది. దీంతో రైతుల వద్ద ఆరు నెలల వడ్డీని బ్యాంకర్లు వసూలు చేస్తున్నారు. ఒక్కో రైతుపై రూ.10వేల దాకా భారం పడుతోంది.

నారాయణ్‌రెడ్డి, జుంటిపల్లి.

**30 మంది పేర్లు లేవు..** గ్రామానికి చెందిన అర్హులైన 30 మంది రైతుల పేర్లు మాఫీ జాబితాలో లేవు. విస్తరణ అధికారిని సంప్రదిస్తే దరఖాస్తు తీసుకున్నాడు. అర్హులందరికీ మాఫీ వర్తింపజేయాలి.

మున్నూరుశేఖర్, చిట్టిగణాపూర్

**రూ.56,500 తీసుకొన్నా మాఫీ కాలేదు**

గ్రామంలో చాలా మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. 2020లో రూ.56,500 రుణం తీసుకొన్నా మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరిగినా జాబితాలో పేరు లేదని చెబుతున్నారు.ఎరుకలి ఆశన్న, హస్నాబాద్..

# కొత్త లైన్లకు సర్వే పూర్తి

జహీరాబాద్ : దశాబ్దాలుగా జహీరాబాద్ ప్రాంతవాసులు రైల్వే మంత్రిత్వ శాఖకు చేస్తున్న విజ్ఞప్తులు ఎట్టకేలకు ఫలించే అవకాశాలున్నాయి. నిజాం కాలంలో ఏర్పాటైన జహీరాబాద్ వయా వికారాబాద్–పర్లీ వైజ్యనాథ్ రైలు మార్గం రెండో లైన్ మంజూరు చేస్తూ.. ప్రయాణికులకు రైల్వేశాఖ తీపి కబురు అందించింది. రైళ్ల అనుసంధానాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో గతేడాది సంగారెడ్డి, వికారాబాద్ జిల్లా వాసులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. వికారాబాద్–పర్లీ వైజ్యనాథ్ మార్గం డబ్లింగ్ సహా తాండూరు సిమెంట్ క్లస్టర్ నుంచి జహీరాబాద్ వరకు మరో కొత్త లైన్ ఏర్పాటుకు ఇటీవల సర్వే పనులు పూర్తయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపడితే రెండు మార్గాలకు మహర్దశ పట్టనుంది.

**తాండూరు సిమెంట్ క్లస్టర్ నుంచి..** ప్రయాణికులతో పాటు సరకు రవాణాకు పెద్దపీట వేస్తు వికారాబాద్ జిల్లాలోని తాండూరు సిమెంట్ క్లస్టర్ నుంచి జహీరాబాద్‌ను కలుతూ రూ.1,350 కోట్ల నిధులతో 75 కి.మీ. పొడవునా కొత్త రైలు మార్గం నిర్మాణం కానుంది. ఈ మార్గం ఏర్పాటుతో జహీరాబాద్, బంట్వారం, పెద్దేముల్ మండలాల మీదుగా కర్ణాటకలోని కుంచవరం తాలుకా ప్రాంతం వరకు రైలు ప్రయాణం అనుకూలంగా మారనుంది. దీంతో తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన జహీరాబాద్ పట్టణానికి మరో రైలు మార్గం అనుసంధానం కానుంది. జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్–మల్‌చెల్మ, కోహీర్ మండలంలోని గొడిగార్‌పల్లి–బడంపేట్, కర్ణాటకలోని కుంచవరం, వికారాబాద్ జిల్లాలోని బంట్వారం మండలంలోని బొప్పనారం, పెద్దేముల్ మండలంలోని ఇందూరు, గొట్లపల్లి, తట్టేపల్లి, తాండూరు మండలంలోని కరణ్‌కోట్, మల్కాపూర్, చెల్కటూర్ గ్రామాల్లో కొత్త సేషన్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

**మూడు రాష్ట్రాలవాసులకు ప్రయోజనం** జహీరాబాద్ మీదుగా వికారాబాద్–పర్లీ వైజ్యనాథ్ రైలు మార్గాన్ని డబ్లింగ్(రెండో లైన్)గా మార్చితే తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రయాణికు లకు ప్రయోజనం చేకూరనుంది. మొత్తం 270 కి.మీ. పొడవున రెండో లైన్ ఏర్పాటు పూర్తయితే రైళ్ల సంఖ్య పెరగనుంది. సుమారు 20 స్టేషన్ల మీదుగా అదనపు దూర ప్రాంత రైళు పరుగులు తీయనున్నాయి. పాత మార్గం కావడంతో భూసేకరణ అవసరం లేకపోవడంతో త్వరలోనే రెండో లైన్ నిర్మాణ పనులు పట్టాలెక్కనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. రైలు మార్గం నిర్మాణం కోసం ఇప్పటికే ప్రైవేటు ఏజెన్సీ సర్వే పూర్తి చేసి నివేదికను ద.మ. రైల్వే అధికారులకు సమర్పించింది. కొత్త రైలు మార్గంలో గేట్లు అవసరం లేకుండా ఆర్వోబీలు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ప్రయాణికులను నిర్దేశించిన గమ్యాలకు చేర్చేలా నిర్మాణం చేపట్టనున్నారు.

# కనీస సౌకర్యాలు కరవు



మెట్‌పల్లి : దశాబ్దాల కిందట ప్రారంభించిన మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సౌకర్యాలు భద్రత కరవయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ముప్పై ఏళ్ల కిందట ఎస్సారెస్పీ క్వార్టర్లలో ప్రారంభించిన గురుకుల పాఠశాల సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతోంది. నూతన భవనం అసంపూర్తిగా ఉండడంతో రేకుల షెడ్డు, శిథిలావస్థకు చేరిన గదుల్లో తరగతులు కొనసాగిస్తున్నారు. తరగతులకు, వసతికి ఒకే గది వినియోగించాల్సిన పరిస్థితి ఉంది. వర్షానికి గదులు ఉరవడం, కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులకు ప్రాణసంకటంగా మారింది. పాఠశాలను ఇంటర్మీడియట్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినా సౌకర్యాలు కల్పించలేదు. 2017లో నూతన భవనం నిర్మాణానికి రూ.4.25 కోట్లు మంజూరు కాగా మరికొన్ని పనులు మిగిలి ఉన్నాయి. పలుమార్లు నిధుల కోసం విన్నవించడంతో ఇటీవల భవనంలో మిగిలిపోయిన ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.15 లక్షలు మంజూరు చేశారు. పనులు పూర్తి కావాల్సి ఉంది.

**పంట పొలాల మధ్య..**

గురుకుల పాఠశాల పంట పొలాల మధ్య ఉంది. వర్షాకాలం కావడంతో గదుల వెనకాల పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయాయి. అక్కడక్కడ వర్షపు నీరు కూడా నిలుస్తోంది. తరగతి గదులకు కిటికీలు సరిగా లేకపోవడం, వాటి వెనకాలే పిచ్చిమొక్కలు పెరగడంతో విషపు కీటకాల ప్రమాదం పొంచి ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో ఓ విద్యార్థి మృతి, ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైన గది కిటికీలకు తలుపులు కూడా లేవు. గతంలో పాఠశాల ఆవరణలోకి పాములు వచ్చాయని తెలుస్తోంది. పలుమార్లు విద్యార్థులను ఎలుకలు కూడా కరిచినట్లు చెబుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా సరిగా లేవు. తరగతి గదుల్లో బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొంటున్నారు. పడుకోవడానికి కూడా మంచాలు లేవు. పాఠశాలలో విద్యార్థి మృతి, ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన జరిగిన తర్వాత విద్యార్థులను కొత్త భవనంలోకి మార్చారు. తాత్కాలికంగా ఏర్పాట్లు చేసి అందులోకి తరలించారు. గురుకులం ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు.

**మౌలిక వసతులు లేవు**

గ్రామీణ పేద విద్యార్థులకు విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. ఇందులో విద్యార్థులకు భోజన వసతితో పాటు ఇతర సౌకర్యాలను ప్రభుత్వమే కల్పిస్తుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అరకొర వసతుల మధ్య చాలీచాలనీ అద్దె భవనాల్లో వసతి గృహాలు కొనసాగుతున్నాయి. కనీస సౌకర్యాల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బీసీ వసతి గృహంలో సుమారు 50 మంది విద్యార్థులు ఉండగా కనీస వసతులు కరవయ్యాయి. విద్యార్థులు ఉండే ఓ గదిలో కిటికీలకు తలుపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 50 మంది విద్యార్థులకు మూడు బాత్‌రూంలు, మూడు మరుగుదొడ్లు ఉండగా వాటికి తలుపులు లేవు. ఉన్న తలుపులు ధ్వంసమయ్యాయి. 50 మంది విద్యార్థులకు సరిపోవడం లేదు. మెట్‌పల్లి వసతి గృహం సంఘటన నేపథ్యంలోనైనా బీసీ వసతి గృహంలో కనీస వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# నిఘా నేత్రాలకు గ్రహణం!



కరీంనగర్ : హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్ద బస్టాండ్ కరీంనగర్‌దే. ఇక్కడ 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం 1,825 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కరీంనగర్ నుంచి రోజు లక్ష మందికి పైగా వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాంటి ప్రయాణ ప్రాంగణంలో సీసీ కెమెరాలు తగినన్ని లేవు. ఉన్నవి పని చేయకపోవడంతో దొంగతనాలు, పోకిరీల బెడద పెరిగింది.

**పట్టింపేదీ?** బస్టాండ్ లోపల, బయట 65కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 45 కెమెరాలు ప్రయాణ ప్రాంగణ ఆవరణలో ఉండగా మిగితావి బయట ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు పోలీస్‌శాఖకు బస్టాండ్‌లో ఓ గది (ఔట్‌పోస్ట్)ని కూడా కేటాయించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో ఏ ఒక్క సీసీ కెమెరా పనిచేయడం లేదు. కొన్ని నిఘా నేత్రాలకు సంబంధించి తీగలు తెగిపోగా మిగిలినవి కూడా పాడైపోగా బాగు చేయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నేర ఘటనలు జరిగినపుడు నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. సీసీ ఫుటేజీల ఆధారంగా పలు కేసుల్లో పోలీసులు గతంలో నిందితులను పట్టుకున్నారు. గతంలో సీసీ కెమెరాలను పోలీసు శాఖ నుంచి నిత్యం పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఆ నిఘానేత్రాలు పని చేయక పోవడంతో బాగు చేయించడానికి గానీ, లేదా కొత్తవి కొనుగోలు చేయడానికి గానీ ఇటు పోలీసుశాఖకు, అటు ఆర్టీసీకి ప్రత్యేకంగా నిధులు అంటూ లేవు. దీంతో సమస్య పరిష్కారానికి ఎవరూ ముందుకు రావడం లేదు. సమస్యపై ఆర్ఎం సుచరితను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. మంత్రిపైనే ఆశలు..

రవాణశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉండటంతో బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తే కొత్త నిఘా నేత్రాలను బిగించడానికి అవసరమైన నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. వీటి పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది కూడా నిత్యం బస్టాండ్‌లో ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో 23 మంది పొరుగు సేవల సెక్యూరిటీ సిబ్బంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య తగ్గింది. సిబ్బందిని పెంచేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

**ఆందోళనలో ప్రయాణికులు..**

ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొందరు దొంగలు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్లు, విలువైన వస్తువుల అపహరణకు పూనుకుంటున్నారు. ఈ నెల 27న సిద్దిపేట నుంచి వచ్చిన ఇద్దరు యువకులు బస్టాండ్‌లో మహిళ మెడలోంచి పుస్తెలతాడు, ప్రయాణికుల జేబులోంచి పర్సులు కొట్టేయడానికి యత్నించగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు చోరీకి యత్నిస్తూ ప్రయాణికులపై బెదిరింపులకు పాల్పడగా సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులు, సెల్‌ఫోన్లు చోరీకి గురైన కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఓ మహిళా కూడా చోరీకి యత్నిస్తూ సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడింది.

కొందరు మద్యం మత్తులో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రాత్రి సమయంలో అక్కడే ఉంటూ వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

# కుక్కల నియంత్రణ చర్యలు శూన్యం

కరీంనగర్: కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలు పరుగులు పెట్టిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం పూట వీధులలో తిరుగుతూ రాకపోకలు సాగించే వృద్ధులు, పిల్లలు, మహిళల వెంట పడుతున్నాయి. రాత్రి అయితే అరుపులుతో గోల చేస్తున్నాయి. నగరంలోని బోయవాడ, సిక్కువాడీ, వావిలాలపల్లి, సప్తగిరికాలనీ, కట్టరాంపూర్, భగత్‌నగర్, శివాజీనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో పలువురిపై దాడికి దిగాయి. ఓ డివిజన్ కార్పొరేటర్ నడుచుకుంటూ వెళ్తుండగా వెనక్కి నుంచి వచ్చి కరుస్తుండటంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు.

**కమిటీ ఏర్పాటు చర్యలేవి?**

పురపాలక శాఖ ఆదేశాల మేరకు వీధికుక్కల నియంత్రణకు కమిటీ వేయాలని, శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని ఆదేశించినా ఆ దిశగా ఎక్కడా చర్యలు కనిపించడం లేదు. యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ), జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం వీధి కుక్కల సంఖ్య తగ్గించేందుకు శస్త్ర చికిత్సలు చేస్తారు. గతేడాది మార్చిలో టెండర్లు పిలవగా ఆ సమయంలో 821 శునకాలకు సంతానోత్పత్తి కలగకుండా ఆపరేషన్లు చేశారు. దీనిపై ఫిర్యాదు అందడంతో అప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలోనే ఫిర్యాదులు అధికంగా వస్తుండటం, ప్రభుత్వం ఆదేశించడంతో ఇటీవల కమిషనర్ పశు వైద్యశాలలో ఉన్న ఏబీసీని పరిశీలించారు. అక్కడ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మరో వైపు టెండర్ ప్రక్రియ కూడా చేయాల్సి ఉంది. అప్పటిలోగా వీటిని ఎలా నియంత్రిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది.

**శస్త్రచికిత్సలు ప్రారంభిస్తాం**

కుక్కల నియంత్రణకు మూడు, నాలుగు రోజులలో శస్త్రచికిత్సలు ప్రారంభిస్తాం. సంబంధిత ఏజెన్సీతో మాట్లాడాం. ఈలోపు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకునేందుకు ఆదేశించాం.

ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

**నగరంలో 4 వేలు..**

కుక్కల సంతానం విపరీతంగా పెరిగింది. ఒక్కో వీధిలో పాతిక సంఖ్యలో



తిరుగుతున్నాయి. 60 డివిజన్లలో సుమారు 4 వేల కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. వీటి సంఖ్య మరింత ఉండనుంది. వీధుల్లో ఆహారం దొరకకపోవడం, చికెన్ సెంటర్లు, మాంసం దుకాణాల దగ్గర అడ్డాలు పెడుతుండటం, వ్యర్థాలు పడేస్తుండటంతో కొట్లాటకు దిగుతున్నాయి.

వీధి కుక్కల బెడద తీవ్రంగా మారి మనుషులపై దాడులకు దిగుతున్నాయి.. వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రభుత్వాన్ని ఇటీవల హైకోర్టు ఆదేశించింది.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా తక్షణ చర్యలు తీసుకునే విధంగా నియంత్రణకు పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కరీంనగర్ జిల్లాలో శునకాల బెడద తగ్గించేందుకు కనీస సౌకర్యాలు కూడా కనిపించడం లేదు. జిల్లా కేంద్రంలో అయితే శస్త్ర చికిత్సలు చేసేందుకు ఆటంకాలు మాత్రం తప్పడం లేదు.

# నిధులు రాక.. సమస్యలు తొలగక

సూర్యాపేట : అన్నదాతలకు సలహాలు, సూచనలు అందించేందుకు వీలుగా రెండు, మూడు గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండేందుకోసం గత ప్రభుత్వం 2021లో క్లస్టర్ల స్థాయిలో రైతు వేదికల నిర్మాణం చేపట్టింది. ప్రారంభ సమయంలో ఒక్కో వేదిక నిర్వహణకు ప్రతి నెల రూ.9 వేల చొప్పున నిధులు విడుదల చేయడంతో సాఫీగా సాగింది. కొత్తగా అధికారం చేపట్టిన ప్రభుత్వం రైతు వేదికలకు నిధుల మంజూరులో జాప్యం చేస్తుండటంతో వాటి నిర్వహణ వ్యవసాయ అధికారులకు భారంగా మారింది. నిధులు కొరవడటంతో నిర్వహణ లేక భవనాలు శిథిల దశకు చేరుతున్నాయి. శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా నియమించిన కార్మికులు చాలా వరకు పనులు మానేశారు. అన్నదాతలు, ఏఈవోలు, సందర్శనకు వచ్చే అధికారులు కూడా కూర్చునేందుకు అనువుగా లేకుండా పోయాయి.

**అవస్థలు ఇవీ..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 73 మండలాల్లో 314 రైతు వేదికలు ఉన్నాయి. వాటికి ప్రతి నెల రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పటికే వివిధ పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. ప్రతి మంగళవారం ఈ వేదికల్లో



'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందుకు అక్కడికి వచ్చిన అధికారులు, అన్నదాతలు వేదిక నిర్వహణ లేమి కారణంగా అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ఉండటంతో రక్షణ కొరవడి ఆకతాయిలు అద్దాలు పగులగొడుతున్నారు. రైతు వేదికలను నిత్యం శుభ్రం చేయడం, మంచినీటిని ఏర్పాటు, ఇతరత్రా పనులు క్షేత్ర స్థాయి అధికారులకు తలకుమించిన భారంగా మారాయి. కొన్నిచోట్ల మండల వ్యవసాయ క్లస్టర్ అధికారులే ఆ ఖర్చులను సొంతంగా వెల్లదీస్తున్నారు. నిధులు విడుదల చేస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు కర్షకులు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదించాం** శ్రీధర్‌రెడ్డి, డీఏవో, సూర్యాపేట : రైతు వేదికల నిర్వహణ నిధులు రావాల్సి ఉంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రతి మంగళవారం వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఏఈవోలు తప్పనిసరిగా హాజరై రైతులకు సాగులో సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఆకతాయిలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవు.

# ఆదాయ వనరులపై ఆర్టీసీ దృష్టి

ఆదిలాబాద్ : ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ ఆదాయ వనరులను పెంచుకోవడంపై దృష్టి సారించింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న స్టాళ్లు, క్యాంటీన్లు, పార్కింగ్ స్థలాలు, ఇతర బహిరంగ స్థలాల్లో వ్యాపారాల నిమిత్తం అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ఔత్సాహికుల నుంచి ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానిస్తూ ప్రకటన జారీ చేశారు. వచ్చే నెలలో ఆర్టీసీకి చెందిన మొత్తం 84 పక్కా, బహిరంగ స్థలాలను ఈ–టెండర్, మాన్యువల్ టెండర్, వేలం వేయనున్నారు. నిబంధనల ప్రకారం అత్యధిక ధర చెల్లించి స్టాళ్లు, బహిరంగ స్థలాలను దక్కించుకున్న వారికి నిర్ణీత కాల వ్యవధితో ఒప్పందం చేసుకుని అద్దెకు ఇవ్వనున్నారు. మహాలక్ష్మి పథకం అమలు కారణంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగి బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతుండడంతో వ్యాపారాల నిమిత్తం అద్దెకు తీసుకుంటే గిట్టుబాటు అవుతుందనే భావన వ్యక్తమవుతోంది.

**ఆరు డిపోల పరిధిలో..**

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలున్నాయి. ఆరు డిపోలు, వాటి



పరిధిలో మండల కేంద్రాల్లో ఆర్టీసీ పేరిట విలువైన ఆస్తులున్నాయి. కొన్ని బస్టాండ్లలో పక్కా స్టాళ్లు ఉండగా మరికొన్ని చోట్ల ఖాళీ స్థలాలున్నాయి. ఇది వరకు అద్దెకు ఇచ్చిన వాటిలో గడువు ముగిసిన స్టాళ్లను, క్యాంటీన్లను, ఖాళీ స్థలాలను గుర్తించారు. బేకరీ, కూల్‌డ్రింక్స్, పండ్లు, పార్కింగ్ స్టాండ్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఫ్యాన్సీ, జనరల్ స్టోర్స్, సెల్‌ఫోన్ రిపేరింగ్ కేంద్రాలు తదితర నిర్దేశిత వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతించారు. మరికొన్ని స్టాళ్లు, ఖాళీ స్థలాల్లో అనుమతి ఉన్న ఏ ఇతర వ్యాపారాలైనా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆయా స్టాళ్లు, స్థలాలకు విస్తీర్ణాన్ని బట్టి నిర్ణీత ధరలను సైతం నిర్ణయించారు. స్టాళ్లు, బహిరంగ స్థలాలకు వేర్వేరుగా టెండరు నిర్వహించనున్నారు. ఈ–టెండర్‌లోని స్టాళ్లకు ఆగస్టు 8లోగా, మాన్యువల్ టెండర్‌కు వచ్చే నెల 16లోగా, వేలంపాటకు 12లోగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

**పారదర్శకంగా టెండరు విధానం**

సోలోమన్, ఆర్టీసీ రీజనల్ మేనేజరు, ఆదిలాబాద్

ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఖాళీగా ఉన్న క్యాంటిన్లు, స్టాళ్లు, పార్కింగ్, బహిరంగ స్థలాలను వ్యాపార నిమిత్తం అద్దెకు ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది. టెండరు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలనుకునే వారు ఎవరైనా డీడీలు చెల్లించి టెండరులో పాల్గొనవచ్చు.

# సింగరేణిలో బదిలీలకు కసరత్తు

గోదావరిఖని : సింగరేణిలో అధికారుల బదిలీలకు కసరత్తు మొదలైంది. ఎన్నికల కోడ్ ముగియడంతో చాలా కాలంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారుల జాబితాను యాజమాన్యం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేస్తుంది. మార్చినెల ముగిసిన తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో బదిలీలకు సంబంధించిన ప్రక్రియను నిలిపివేశారు. సింగరేణిలో పనిచేస్తున్న మైనింగ్, పర్సనల్, ఇంజినీరింగ్, ఐటీ, ఫైనాన్స్ తదితర విభాగాల్లో పనిచేసే అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసేవారు. లోక్‌సభ ఎన్నికలు రావడంతో కోడ్ అమలులోకి రావడంతో బదిలీల ప్రక్రియను పక్కన పెట్టిన యాజమాన్యం ఎన్నికలు ముగిసే వరకు వేచి చూసింది. ఈనెల 6తో కోడ్ ముగియడంతో యాజమాన్యం అధికారుల బదిలీలకు సంబంధించిన కసరత్తు మొదలు పెట్టింది. ఏ అధికారి ఎక్కడ ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారు. అక్కడికి మరో అధికారిని బదిలీ చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సింగరేణిలో కీలక స్థానాల్లో ఉన్న అధికారుల బదిలీలపై దృష్టి సారించిన యాజమాన్యం ఆ తర్వాత ప్రాధాన్యత లేని విభాగాల్లో బదిలీలు చేపట్టే అవకాశం ఉంది.

కీలక స్థానాల కోసం ప్రయత్నాలు

కీలక స్థానాల్లో పోస్టింగ్ కోసం కొంత మంది అధికారులు ప్రయత్నిస్తున్నారు. తమకున్న పరిచయాలతో కీలక స్థానాల్లో బాధ్యతలు చేపట్టేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. బదిలీలకు సంబంధించిన ప్రక్రియను పూర్తిగా సీఎండీ పరిశీలించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో వివిధ వర్గాలకు చెందిన కీలక వ్యక్తుల ద్వారా ప్రయత్నం చేస్తున్నారు. సింగరేణిలో కొన్ని ప్రాంతాలు కీలకంగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు తమ వ్యక్తిగత రికార్డులు, పనితీరుకు సంబంధించిన వివరాలను పంపిస్తున్నట్లు తెలుస్తోంది.

# లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

పెద్దపల్లి : "లేఅవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి ఖజానాకు అదనపు ఆదాయం సమకూర్చాలి. కబ్జాదారులకు వర్తింపజేయకుండా పూర్తిగా అర్హమైన స్థలాలకే ఈ పథకాన్ని వర్తింపజేయాలి." లేఅవుట్ల క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్లుగా తమ భూములను క్రమబద్ధీకరించేందుకు వేచి చూస్తున్నవారి ఎదురుచూపులకు తెరదించింది. 2020లో స్వీకరించిన దరఖాస్తులకు లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని కల్పించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ, కోర్టు ఆదేశాలున్న భూములు మినహా ఇతర లేఅవుట్లను క్రమబద్ధీకరించనున్నారు. గతంలో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశం ఇవ్వనున్నారు. నగర, పురపాలికలు, పంచాయతీల పరిధిలో అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఆహ్వానించడంతో జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు అందాయి. ఈ క్రమంలో న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ ప్రక్రియ నిలిచింది. తాజాగా ఉప ముఖ్యమంత్రి వివిధ శాఖలతో నిర్వహించిన సమీక్షలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ ప్రక్రియపై కదలిక వచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం లభించనుంది.

ఖజానాకు కాసుల గలగల

అక్టోబర్ 30, 2020 నాడు తుది గడువు విధించిన గత ప్రభుత్వం మొత్తం జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించింది. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 7,061 దరఖాస్తులు వచ్చాయి. పెద్దపల్లిలో-9,675, సుల్తానాబాద్‌లో- 1,500, మంథనిలో-310 కలిపి మొత్తం 18,546 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలన



చేపట్టక ముందే న్యాయ స్థానంలో వ్యాజ్యం దాఖలు కావడంతో అధికారులు పక్కన పెట్టారు. క్రమబద్ధీకరణ కాని ప్లాట్లు రిజిస్ట్రేషన్లు కాకపోవడం, ఇంటి నిర్మాణానికి బ్యాంకుల నుంచి రుణాలకు అర్హత పొందకపోవడం, అధికారికంగా ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో అనేక సమస్యలు దరఖాస్తుదారులు ఎదుర్కొన్నారు. క్రమబద్ధీకరణ ద్వారా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పట్లో రూ.వెయ్యి మాత్రమే చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. క్రమబద్ధీకరణ దరఖాస్తుల ఆహ్వాన సమయంలో పోలిస్తే ప్రస్తుతం భూముల మార్కెట్ విలువతో పాటు రిజిస్ట్రేషన్ రుసుములు కూడా భారీగా పెరిగాయి. ఎల్ఆర్ఎస్‌తో పాటు భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ల ద్వారా భారీగానే ఖజానాకు ఆదాయం రానుంది.

# నిత్యావసర వస్తువుల పక్కదారికి చెల్లు



కరీంనగర్ : జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లోని బాలికల వసతిగృహాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యంగా నిత్యావసర సరకుల విషయంలో పారదర్శకతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటి వరకు సరకుల వినియోగం, వాటి సరఫరా వంటి వివరాలను కాగితాలపై నమోదు చేస్తుండటంతో కొన్నిసార్లు వాటి విషయంలో తేడాలు, కొన్ని చోట్ల అవి పక్కదారి పడుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు వాటి వివరాలు కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు తెలిసేలా ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొస్తుంది. హాస్టల్ మేనేజ్‌మెంట్ యాప్ పేరుతో దాని రూపకల్పన దాదాపు పూర్తి కావొచ్చిందని సమాచారం. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి దీన్ని వాడకంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాళ్లకు, ఆయా విద్యాసంస్థల్లోని విభాగాలు నిర్వహించే బాధ్యులకు యాప్ నిర్వహణ విషయమై శిక్షణ అందించనున్నారు.

పక్కాగా పర్యవేక్షణ..

ఉమ్మడి జిల్లాలో 49 కేజీబీవీలు, 38 ఆదర్శ పాఠశాలలున్నాయి. వాటిల్లోని బాలికల వసతిగృహాలను కేజీబీవీల ప్రిన్సిపాళ్లు పర్యవేక్షిస్తున్నారు. వీటికి నిత్యావసర సరకులు, కూరగాయలు తదితర సామగ్రిని జిల్లా స్థాయిలో టెండర్లు పిలిచి గుత్తేదారులను ఎంపిక చేసి సరకులు అందిస్తున్నారు. ప్రతి రోజు వచ్చిన సరకుల ప్రారంభ నిల్వ, వినియోగించాక ముగింపు నిల్వను రికార్డుల్లో రాస్తున్నారు. ఈ విద్యాలయాల్లోని అకౌంటెంట్లు ఈ విధులను నిర్వహిస్తున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారుల సందర్శనలో సదరు రికార్డులు పరిశీలిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాలయాల్లో సరకుల కొరత, నిల్వల్లో తేడాలు వంటివి అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయి. కొన్ని సార్లు సరకుల వివరాల నమోదును రాయకుండా ఉన్న సందర్భాలు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టి వాటి ఉపయోగాన్ని, నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు తీసుకొస్తున్న యాప్ ద్వారా రోజూ సమగ్ర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

ఏయే వివరాలు నమోదు చేస్తారంటే..

మొదట కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లోని మౌలిక వసతులను యాప్‌లో నమోదు చేయాలి. ఇందుకు ప్రత్యేకాధికారులు అభ్యాసం చేస్తున్నారు. నిత్యం విద్యార్థుల సంఖ్య, క్రితం రోజు ముగింపు నిల్వ, ఆ రోజు ప్రారంభ నిల్వగా పేర్కొంటూ, ఏరోజుకారోజు గుత్తేదారు అందించిన సరకుల వివరాలు, ఎంతమేర వంటలకు వినియోగించింది. రాత్రి భోజనం తర్వాత ఎంత సరకు నిల్వ ఉందో ముగింపు నిల్వలను యాప్‌లో నమోదు చేయాలి. ఈ విషయంలో తేడాలుంటే అధికారుల సందర్శనలో చర్యలుంటాయి. గుత్తేదారు సకాలంలో సరకులు తెస్తున్నారా? లేదా? అనేది ఉన్నతాధికారులు నిత్యం గమనించే అవకాశముంది. రోజు వారీ నిర్వహణలో నగదు చెల్లించాల్సి వస్తే ఆ వివరాలు కూడా నమోదు చేసేలా వీలు కల్పిస్తున్నారు.

# మట్టిమేలు పసిగట్టి.. కాసులు రాబట్టి..!



ఆలేరు : నీరులేని చెరువులు, కుంటలు అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. ప్రభుత్వ, అసైన్డు భూముల్లోనూ గుట్టు చప్పుడు కాకుండా మట్టిని తరలిస్తూ.. ఇటుక బట్టీలు, స్థిరాస్తి వ్యాపారులకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా కొందరు మట్టి దందా సాగిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. గుట్టలను సైతం విడిచిపెట్టడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా..

మట్టి ఉన్న చోట ఇటుక బట్టీ ఏర్పాటు చేసుకుంటే మట్టి తరలింపునకు అనుమతులు అవసరం లేదు. ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తే మాత్రం నీటిపారుదల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. క్యూబిక్ మీటరుకు కొంత సీనరేజ్ ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. చెరువుల్లో మట్టి తవ్వకాలకు యంత్రాలు ఉపయోగించరాదు. కానీ యంత్రాల ద్వారా తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీంతో చెరువుల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గతంలో దూదివెంకటాపురం ఊర చెర్వు నుంచి కూడా ఇలాగే మట్టి తరలింపు చేపడితే స్థానికుల ఫిర్యాదు మేరకు సదరు వాహనాలపై రెవెన్యూ అధికారులు జరిమానా వేసిన విషయం తెలిసిందే.

ఇటుక బట్టీలకు చేరవేస్తూ..

మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారులు గ్రామాలకొచ్చి ఎంతో కొంత ముట్టజెప్పి అభివృద్ధి పేరిట మట్టిని తరలించుకుపోతున్నారు. జంట నగరాల శివార్లలోని కీసర లాంటి ప్రాంతాల నల్లమట్టిని ఇటుకబట్టీల వ్యాపారులకు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తేలికపాటి ఇటుకల తయారీలో అధికంగా నల్లమట్టి వినియోగిస్తున్నారు. దానికి డిమాండ్ బాగా ఉంది. దీంతో నీటి వనరుల్లోని మట్టితో తయారు చేస్తున్న ఇటుకలకు డిమాండ్ పెరుగుతుండటంతో పరిసర ప్రాంతాల్లో అనధికార బట్టీలు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. ఇందుకు ఆయా పార్టీల నాయకులు సంబంధిత అధికారులతో కుమ్మక్కై ఈ దందాకు తెరలేపినట్లుగా కనిపిస్తుంది. ముఖ్యంగా నీటి వనరుల్లోని మట్టికి బేరం పెడుతున్నారు. పొక్లెయిన్లతో తవ్వకాలు జరిపి రాత్రివేళ టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నూతన వెంచర్లకు సైతం పెద్దఎత్తున రవాణా చేస్తున్నారు. ఎవరైనా అడిగితే అనుమతులు ఉన్నాయంటూ, స్థానికంగా రైతుల పొలాల్లోకి స్వల్ప సొమ్ము ద్వారా చేరవేస్తున్నట్లుగా బుకాయిస్తున్నారు. ఇటీవల బేగంపేట శివారులోని గండిచెర్వు నుంచి పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు చేరవేశారు. తాజాగా నెమిల శివారులోని ఊర చెర్వులో నీటినిల్వలు తగ్గడంతో కొన్ని రోజులుగా సమీప ఇటుకబట్టీ వ్యాపారులకు విక్రయించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులకు సమాచారం చేరవేసినా అంటీముంటనట్లు ఉంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తాం..

– దామోదర్, తహసీల్దారు, రాజపేట

ముందస్తు అనుమతి లేకుండా చెరువుల్లోని మట్టిని ఇతర ప్రాంతాలకు చేరవేయడం చట్టరీత్యా నేరం. ఈ విషయమై ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. రాత్రివేళ నిఘాను మరింత పెంచుతాం. అక్రమ రవాణాను పోలీసుల సహకారంతో నిలువరించే ప్రయత్నం చేస్తాం.

# ధ్రువీకరణ పత్రం.. వీడాలి అలసత్వం

మిర్యాలగూడ : సాధారణంగా విద్యార్థులు, ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే వారికి ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతాయో అందరికీ తెలుసు. అయితే అనేక మంది తెలియకనో.. నిర్లక్ష్యమో కానీ తీరా అత్యవసరమయ్యే సమయంలో కార్యాలయాలకు పరుగులు తీస్తూ.. సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తుంటారు. మరి కొందరైతే పని తొందరగా కావాలనే ఉద్దేశంతో డబ్బు పోయినా ఫర్వాలేదని.. దళారులను ఆశ్రయిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని తహసీల్, పుర కార్యాలయాల్లో దళారుల హవానే నడుస్తుంది. విద్యార్థులకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలు ముందుగానే తీసుకుని అందుబాటులో ఉంచుకోవడంతో.. ఆందోళన చెందాల్సిన పని లేదని.. త్వరలో విద్యాసంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే పత్రాలకు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అత్యవసరమయ్యేవి ఇవే..

సాధారణంగా ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డుతో పాటు కుల, ఆదాయ, జనన, నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరం. కేంద్ర విద్యాసంస్థలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఓబీసీ ధ్రువీకరణ పత్రం, నాన్ క్రీమీలేయర్ పత్రం కలిగి ఉండాలి. అధికారిక నిబంధనల ప్రకారం ఈ పత్రాలు తీసుకోవాలంటే దరఖాస్తు చేసుకున్న తర్వాత ఏడు నుంచి 45 రోజుల పాటు వేచి చూడాలి. అయితే అధికారులు ఒకటి, రెండు రోజుల్లోనే అందిస్తున్నారు. అనివార్య కారణాలతో కొంత మందికి పత్రాలు



ఆలస్యం కావడంతో వారు సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇటువంటి పరిస్థితి రాకూడదడదంటే ముందుగానే మేల్కోవాలి.

ఏ పత్రం ఎలా తీసుకోవాలి..?

ఎటువంటి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నా.. ముందు వాటికి సంబంధించిన దరఖాస్తు ఫారాన్ని నింపి.. సమీపంలోని మీ సేవ కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు జత చేసిన ఆధారాలను స్కాన్ చేసి అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తారు. ఇలా చేసిన దరఖాస్తులను తహసీల్ కార్యాలయాల్లో సిబ్బంది డౌన్‌లోడ్ చేసి.. విచారణ నిమిత్తం రెవెన్యూ అధికారికి అందిస్తారు. ఆ దరఖాస్తుపై క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారి విచారణ చేపట్టి.. తన నివేదికను పొందుపరుస్తారు. ఆ తర్వాత దరఖాస్తును, ఆర్ఐ నివేదికను తహసీల్దారు పరిశీలించి.. అన్ని సక్రమంగా ఉంటే అనుమతిస్తున్నట్లుగా డిజిటల్ సంతకం చేస్తారు. ఆ తర్వాత దరఖాస్తుదారు ఫోన్‌కు సంక్షిప్త సందేశం వస్తుంది. వెంటనే తిరిగి మీసేవా కేంద్రానికి వెళ్తే అధికారిక ధ్రువీకరణ పత్రం ప్రింట్ తీసి ఇస్తారు.

# 'పేట'లో మరో కృషి విజ్ఞానం

గరిడేపల్లి : దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు నూతన సాంకేతికతను చేరువ చేయడానికి కేంద్రం అడుగులు వేస్తోంది. దేశంలో ఇప్పటికే రైతులకు సేవలందిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రాలను మరింత విస్తృత పరచడానికి కసరత్తు చేస్తోంది. సామర్థ్యం, అభివృద్ధి, సాంకేతికత, ఉపోద్ఘాతం, సలహాలు, సూచనలతో రైతుకు పరిశోధనా ఫలాలు అందించేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న కేవీకేలకు అదనంగా మరో 16 ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది. సూర్యాపేట జిల్లాలోనూ కేవీకే ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. ఉత్తమంగా గడ్డిపల్లి కేవీకే

1974లో అప్పటి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు దేశ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులను సిద్ధం చేయడానికి నూతన పథకం తీసుకురావాలని సంకల్పించింది. అందులో భాగంగానే పుదుచ్చేరిలో మొదటి కేవీకేను స్థాపించారు. తర్వాత పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా పెంచుకుంటూ ఇప్పటి వరకు 731 కేవీకేలు ఏర్పాటు చేశారు. రైతులకు అందిస్తున్న సేవలకుగానూ 1996లో గడ్డిపల్లి కేవీకేకు ఉత్తమ కేవీకే అవార్డు లభించడం విశేషం.

మరిన్ని సేవలు ఇలా..

కేవీకే లక్ష్యాలను నెరవేర్చడంతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచించిన పథకాలు, కార్యక్రమాలను సైతం అమలు చేస్తుంది. జిల్లాలో కూరగాయలు, పండ్ల తోటలు, వరి పొలాలు సందర్శించి



సీజన్‌ల వారీగా పంటల్లో వచ్చే చీడపీడలు, లక్షణాలు, నివారణ, నీటి, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు. దాంతో పాటు మేనేజ్, ఎన్ఐపీహెచ్ఎం, ఎన్ఏఏఆర్ఎం, ఎన్ఎఫ్ఎల్, ఎన్ఐఎంఎస్ఎంఈ, ఎస్ఏఎంఆర్‌టీఐ వారి ఆర్థిక సాయంతో గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంలో మంచి పద్ధతులపై నైపుణ్య శిక్షణ ఇస్తారు. భూసార పరీక్షల ప్రాధాన్యం, పరీక్షల నిర్వహణ, ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక అమలు, వ్యాపారులు, డీలర్లు పప్పు మిల్లుల యజమానులకు అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు చేపడుతున్నారు.

సిబ్బంది అనుభవం

కేవీకేలో పలువురు శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారు. ఉద్యాన విభాగం, సస్యరక్షణ కీటక విభాగం, సేద్యపు విభాగం, గృహ విజ్ఞానం, విస్తరణ విభాగం, ఫిషరీస్/పశుసంవర్ధక శాస్త్రవేత్తలు ఉంటారు. మృత్తికా విభాగం, పట్టు పురుగుల శాస్త్రవేత్తలు ఆయా కేవీకేలను బట్టి కేటాయిస్తారు. వీరితో పాటు సీనియర్ సైంటిస్ట్ హెడ్ ఉంటారు.

లక్ష్యాలు, ఉద్దేశాలు:

రాష్ట్రంలో, దేశంలో పరిశోధనా కేంద్రాల్లో రూపొందించిన కొత్త వంగడాలను స్థానిక కేవీకేలలో పండిస్తారు. వాటి నాణ్యత, ప్రాంతీయ సాగుకు అనుకూలత, విశిష్టతలు, సాంకేతిక వినియోగం తదితర అంశాలపై నివేదికలు రూపొందించడం ద్వారా పరిశోధనా స్థానాలు అందించిన నూతన విత్తనాలను వినియోగంలోకి తేవడం.

పొలాల్లో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి అవసరమైన క్షేత్ర ప్రదర్శనలు చేయడం.

ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై రైతుల జ్ఞానం, నైపుణ్యం నవీకరించడం, జిల్లా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయ కార్యక్రమాలకు వ్యవసాయ పరిజ్ఞానానికి నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్‌గా పనిచేయడం, రైతులకు ఆసక్తి ఉన్న అన్ని విభిన్న విషయాలపై వ్యవసాయ సలహాలు అందించడం.

నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు బయట సైతం కొనుగోలు చేసే వారికి అవగాహన కల్పించడం ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించే వీలుంటుంది.

# కొలతల తకరారు

కామారెడ్డి : పురపాలకశాఖ పారదర్శకత కోసం తెచ్చిన స్వీయ మదింపు విధానం అక్రమార్కులకు వరంగా మారింది. అనుమతులు ఒకలా పొంది.. నిర్మాణాలు మరొకలా చేపట్టి ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను మదింపు కోసం దరఖాస్తు చేసుకోగా తప్పిదాలు వెలుగుచూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1521 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. పురపాలక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నిర్మాణాలు పరిశీలించి యజమానులు తప్పుడు కొలతలు నమోదు చేయడాన్ని గుర్తించారు.

పరిశీలనతో వెలుగులోకి అక్రమాలు

ఉమ్మడి జిల్లాలో నగర, పురపాలక సంఘాల్లో 7789 స్వీయ మదింపు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయి. అందులో 6178 అర్జీలను అధికారులు ఆమోదించారు. స్వీయ కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో సమర్పించాలని పురపాలక శాఖ సూచించగా అనేక మంది యజమా



నులు తప్పుడు కొలతలను అందజేశారు. కింది స్థాయి సిబ్బందిని మచ్చిక చేసుకోవాలని భావించారు. నగర, పురపాలికల్లో పనిచేసే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో కాలు కదపడంతో అక్రమాలు వెలుగుచూశాయి.

భారీగా అపరాధ రుసుం

తప్పుడు కొలతలు సమర్పిస్తే మొత్తం ఆస్తి పన్ను మదింపునకు అదనంగా 25 నుంచి 100 శాతం వరకు అపరాధ రుసుం విధించే అవకాశం ఉంది. పారదర్శకత కోసం తెచ్చిన విధానాన్ని సక్రమంగా వినియోగించుకుంటే ఇబ్బందులను అధిగమించే అవకాశముంది. స్వీయ మదింపునకు స్పందన బాగానే ఉందని కామారెడ్డి బల్దియా కమిషనర్ సుజాత వెల్లడించారు. తప్పుడు కొలతలను సమర్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.




## ఏపీలో బియ్యం, కందిపప్పు ధరలు తగ్గించిన ప్రభుత్వం

అమరావతి: నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకి సామాన్యులు విలవిల్లాడుతున్న వేళ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం ధరలను మరో దఫా తగ్గించాలని నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో ధర రూ.160గా ఉండగా దానిని రూ.150కి తగ్గిస్తున్నామని ప్రకటించారు. ఇక బియ్యం ధరను రూ.48 నుంచి రూ.47కి స్వల్పంగా తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బుధవారం స్పందించారు.తగ్గించిన ధరలతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నామని, గురువారం నుంచి విక్రయిస్తారని మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లను ఆదేశించామని నాదెండ్ల మనోహర్ వివరించారు. రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ నెల రోజుల వ్యవధిలో బియ్యం, కంది పప్పు ధరలను రెండుసార్లు తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని ఆయన ప్రస్తావించారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం ధరల స్థిరీకరణపై దృష్టిసారించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ రైస్ ధరల తగ్గింపుపై దృష్టిసారించారు. ఇటీవలే వ్యాపారులతో మంత్రి సమావేశమయ్యారు.

బియ్యం, కందిపప్పు ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. బ్లాక్ మార్కెట్ వంటి చర్యలకు పాల్పడవద్దని, సామాన్య జనాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ధరల స్థిరీకరణలో భాగంగా ఇటీవల కూడా బియ్యం, కందిపప్పు ధరలను స్వల్పంగా తగ్గించారు. ఈ నెల 11 నుంచి రైతు బజార్లలో కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రూ.180 ఉండగా రూ.160కి, స్టీమ్డ్ రైస్ కేజీ రూ.55.85 నుంచి రూ.49కి, ముడి బియ్యం కేజీ రూ.52.40 నుంచి రూ.48కి తగ్గించారు.




కేరళలోని వయనాడ్ జిల్లా మెప్పడి, మండక్కై, చూరాల్‌మల, అట్టామల, నూల్‌పుజా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కొండ చరియలు విరిగిపడి గ్రామాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. వందల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల మంది బురద మట్టిలో కూరుకుపోయారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

## చంద్రబాబు రివ్యూలో కబ్జా పర్వంపై ఓపెన్ అయిన అధికారులు

అమరావతి: పరిశ్రమల శాఖపై సీఎం చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. గత 5 ఏళ్ల కాలంలో పరిశ్రమల శాఖ పనితీరుపై రివ్యూ చేశారు. తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో ఒప్పందం చేసుకున్న పారిశ్రామిక వేత్తలు వైసీపీ ప్రభుత్వంలో వెనక్కి వెళ్లారని అధికారులు తెలిపారు. ప్రభుత్వం సహకరించకపోవడం, వివిధ కారణాలతో వేధింపులకు పాల్పడడంతో భూ కేటాయింపులు జరిగిన తరువాత కూడా పలు కంపెనీలు వెళ్లిపోయాయన్నారు. ఇండస్ట్రీ కోసం కేటాయించిన భూముల కబ్జాలతో పాటు.. అధికార దుర్వినియోగం జరిగిందని అధికారులు అంగీకరించారు. రాష్ట్రం నుంచి విడిచిపోయిన కంపెనీలను తిరిగి రప్పించేందుకు గట్టిగా ప్రయత్నాలు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తల్లో తిరిగి నమ్మకాన్ని కల్పించేందుకు స్వయంగా తాను మాట్లాడుతానని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆయా జిల్లాల్లో ఉన్న భూముల లభ్యత.. ఏఏ ప్రాంతాలు ఇండస్ట్రియల్ క్లస్టర్స్‌కు అనుకూలం అనే అంశాలపై చర్చ జరగనుంది. రివ్యూ కొనసాగుతోంది. మంత్రులు టిడి భరత్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. కాగా అంతకు ముందు.. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుప్పం వైసీపీ నేతలు.. టీడీపీలో చేరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో కుప్పం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు, 15 మంది ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. కుప్పం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని వైసీపీ నేతలు అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. త్వరలోనే కుప్పం నియోజకవర్గానికి చెందిన మరికొందరు వైసీపీ కీలక నేతలు టీడీపీలో



చేరబోతున్నారన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కుప్పంలో ఎలాంటి అరాచకాలు చోటుచేసుకున్నాయో అందరికీ తెలుసన్నారు. కుప్పంలో వైసీపీ అవినీతి అరాచకాలపై విచారణ జరుగుతుందని శ్రీకాంత్ తెలిపారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ. 250 కోట్లు కేటాయించారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీనివాస్ తెలిపారు. హంద్రీనీవా కాలువ ద్వారా వచ్చే నీటిని నిలువ చేయడానికి 500 కోట్లతో రిజర్వాయర్లు నిర్మిస్తున్నామన్నారు.

కుప్పంలో 2000 ఎకరాలతో సెజ్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన 40 రోజుల్లోనే కుప్పం అభివృద్ధికి చంద్రబాబు నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరైతే తటస్థులుగా ఉండి కుప్పం అభివృద్ధిని కోరుకుంటున్నారో వారందరినీ టీడీపీలోకి ఆహ్వానిస్తామని కంచర్ల శ్రీకాంత్ వెల్లడించారు.

## ఇరిగేషన్ పనుల్లో రూ.200కోట్ల కుంభకోణం..

నెల్లూరు: గత వైసీపీ ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులకు సంబంధించి రూ.200కోట్ల అవినీతి జరిగినట్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ ప్రాతినిధ్యం వహించిన సర్వేపల్లిలో పెద్దఎత్తున కుంభకోణం జరిగిందని ఆయన అన్నారు. నీటిపారుదల శాఖ పనులకు సంబంధించి ఒక్క పనీ చేయకుండానే కోట్లలో నిధులు స్వాహా చేశారని సోమిరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా అక్కంపేట, వీరంపల్లి ప్రాంతాల్లోని పలు ఇరిగేషన్ పనులను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. గత ఐదేళ్ల పాలనలో ఒకే పనికి ఒక్కో ఏడాది వేర్వేరుగా బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. ఒక్క పార మట్టి తీయకుండా, ఒక్క చెట్టు కొట్టకుండానే బిల్లులు చేసుకున్నారని మండిపడ్డారు. 5ప్యాకేజీల పేరుతో మాజీ మంత్రి కాకాణి లెఫ్ట్, రైట్ నిధులు దోచుకున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. పనులు చేయకుండానే బిల్లులు చేయాలని కాకాణి తమ గొంతుపై కత్తిపెట్టి బెదిరిస్తేనే తాము ఆ పని చేసినట్లు అధికారులు చెబుతున్నారని సోమిరెడ్డి చెప్పారు. వైసీపీ హయాంలో తన మాట వినని ఓ అధికారిని ఆయన శ్రీకాకుళం బదిలీ చేశారని, మిగిలిన వారినీ శ్రీకాకుళం వెళ్తారా అంటూ బెదిరించినట్లు ఎమ్మెల్యే ఆరోపించారు. తప్పు ఎవరు చేసినా తప్పే, ఎవ్వరినీ వదిలేది లేదని సోమిరెడ్డి హెచ్చరించారు. ఏపీలో వైసీపీ పాపాలకి రైతులు మూడు లక్షల ఎకరాల్లో మొదటి పంట పండిచుకోలేకపోయారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఏపీలో జగన్ ఇసుక, మద్యం, ఖనిజాలు దోచుకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానికంగా అవినీతికి పాల్పడ్డారని అన్నారు. సర్వేపల్లిలో జరిగిన అక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సర్వేపల్లిలో అవినీతిపై కచ్చితంగా విచారణ చేస్తామని, అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలేది లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి హెచ్చరించారు.

## సీఎం చంద్రబాబు శ్రీశైలం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు..

నంద్యాల: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రోజున శ్రీశైలంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లమల శ్రీశైలం అడవులను గ్రేహౌండ్స్, బాంబుస్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. శ్రీశైలం ఆలయం, జలాశయం వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రానా పరిశీలించారు. అనంతరం సుండిపెంట ప్రజావేదిక, హెలిప్యాడ్ ప్రాంతాలను వారు పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద బాంబు, డాగ్ స్క్వాడ్లతో పోలీసులు సైతం ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. సీఎం పర్యటన విజయవంతం అయ్యేలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు..** గురువారం ఉదయం 9:50గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం స్వామీఅమ్మవార్లను దర్శించుకుంటారు.



శ్రీశైల ప్రాజెక్టు వద్ద జలహారతి కార్యక్రమాన్ని చంద్రబాబు నిర్వహిస్తారు. తర్వాత కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం సున్నిపెంట వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులతో సీఎం ముఖాముఖి చర్చాగోష్టి నిర్వహిస్తారు. అనంతరం తిరుగు ప్రయాణం అవుతారు.




దిల్లీ: మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌పై అవినీతి ఆరోపణల వ్యవహారంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసింది. ఈమేరకు అధికారులు బుధవారం వెల్లడించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్ పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది.

ఈ క్రమంలోనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ ఖేడ్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే, దీనికి ఆమె నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. “జులై 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించాం. కానీ, ఆమె ఆగస్టు 4 వరకు గడువు కావాలని కోరింది. ఇందుకు తిరస్కరించి.. జులై 30 వరకు అదనపు సమయం కల్పించాం. ఇదే చివరి అవకాశమని.. ఎలాంటి పొడిగింపులు ఉండవని స్పష్టంచేశాం. కానీ, ఆమె గడువులోగా తమ సమాధానాన్ని సమర్పించలేదు. అందువల్ల సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌–2022లో ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తున్నాం. భవిష్యత్తులో కమిషన్ నిర్వహించే నియామక పరీక్షలు/ఎంపికలకు హాజరుకాకుండా శాశ్వతంగా డిబార్ చేస్తున్నాం” అని యూపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది. యూపీఎస్సీ పరీక్ష నిబంధనల్ని అతిక్రమిస్తూ అవకాశాలు వాడుకొని ఆమె నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించామని గతంలో కమిషన్ పేర్కొంది. తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటోగ్రాఫ్/సంతకం, ఈ–మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, చిరునామాకు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం ద్వారా మోసపూరిత ప్రయత్నాలకు పాల్పడ్డారని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఆమె ప్రొబేషన్‌ను నిలిపివేసి.. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించగా ఆమె అక్కడికి వెళ్లలేదు.

మరోవైపు, చీటింగ్–ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ నిమిత్తం ఆమె ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై ఆగస్టు 1వ తేదీన న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.




## ఎంసీడీలో ఒక్క అధికారి అయినా అరెస్టయ్యారా? దిల్లీ హైకోర్టు ఆగ్రహం

దిల్లీ: బేస్‌మెంట్‌లోకి వరద నీరు చేరడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతి చెందిన ఘటనలో మున్సిపల్ అధికారుల తీరుపై దిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇప్పటివరకు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఉచితాలకు ప్రాధాన్యం ఇస్తే ఇలాంటి పరిణామాలే ఎదుర్కోవాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. విద్యార్థుల మరణాలపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తాజాగా విచారించింది. ఈనేపథ్యంలో అధికారుల తీరును తప్పుబట్టింది. ఉచితాలను ప్రోత్సహిస్తూ.. పన్నులు వసూలుచేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతించి డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే ఇలాంటి అనర్థాలకు దారితీస్తుందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. బాటసారులపై పోలీసుల చర్యలు ఉంటాయి. కానీ, ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ) అధికారులపై లేవంటూ విమర్శించింది. పట్టణ నిర్వహణ ప్రణాళికపై అధికారులను ప్రశ్నించింది. “మీరు ఈ కేసులో జూనియర్ అధికారులను అయితే తొలగించారు. కానీ, పర్యవేక్షించాల్సిన సీనియర్ అధికారుల సంగతేంటి? ఎంసీడీ నుంచి ఎవరైనా జైలుకు వెళ్లారా?” అని కోర్టు ప్రశ్నించింది. కోచింగ్ సెంటర్‌లో సంభవించిన ఈ మరణాలపై విచారణను కేంద్ర ఏజెన్సీకి బదిలీ చేయాలని సూచనప్రాయంగా పేర్కొంది. దీంతోపాటు రాజేందర్‌నగర్ ప్రాంతంలో డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. నగర ఎంసీడీ కమిషనర్, డీసీపీ, దర్యాప్తు అధికారి కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.




దిల్లీ: సెంట్రల్ దిల్లీలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరద పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై ఆగ్రహం వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమ స్నేహితులు ప్రాణాలు కోల్పోయారని సహచర విద్యార్థులు ఆరోపించారు. ఈ ఘటనపై ‘దృష్టి ఐఏఎస్’ సంస్థ యాజమాన్యం స్పందించింది. “ముగ్గురు విద్యార్థుల అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలిజేస్తున్నాం. ఈ ఘటనతో విద్యార్థుల్లో పెల్లుబికిన ఆగ్రహం సరైందే. వారి ఆవేశం సరైన దిశలో ఉంటేనే మేలు జరుగుతుంది. కోచింగ్ సెంటర్ల కోసం సరికొత్త మార్గదర్శకాల రూపకల్పన విషయంలో మేం సహకరిస్తాం” అని తెలిపింది. అలాగే కోచింగ్ సంస్థలకు సంబంధించిన సమస్యలు పైకి కనిపించినంత సులభంగా ఉండవని యజమాని వికాస్ దివ్యకీర్తి అన్నారు. డీడీఏ(దిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ), ఎంసీడీ(మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ), అగ్నిమాపక విభాగం నియంత్రణల విషయంలో పలు అసమానతలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. దిల్లీ మాస్టర్ ప్లాన్–2021లో మినహా మరెక్కడా కోచింగ్ సంస్థలకు సంబంధించి ఎలాంటి నిబంధనలను ప్రస్తావించలేదని గుర్తుచేశారు. తాజాగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నివేదికలో అయినా తగిన పరిష్కారాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. “ప్రభుత్వమే దిల్లీలో కొన్ని స్థలాలను ఎంపికచేసి, వాటిని కోచింగ్ సంస్థల కోసం కేటాయించాలి. తరగతి గదులు, లైబ్రరీలు, హాస్టళ్లకు రూపకల్పన చేస్తే.. అప్పుడు అధిక అద్దె, భద్రతా సమస్యలు ఉండవు” అని సూచించారు. ఇక ఈ కేసులో తనను బలిపశువును చేస్తున్నారని మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. “ఒకరిని బలిపశువును చేయడం వల్ల తాము బయటపడిపోయామని యంత్రాంగం అనుకుంటుంది. ప్రజలేమో నిందితుడు దొరికాడని భావిస్తారు” అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అలాగే విద్యార్థుల మృతి ఘటనపై ఆలస్యంగా స్పందించడంపై అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. “ఉద్వేగపూరిత అంశాలపై నేను అంతగా మాట్లాడను. ఆ విద్యార్థులకు బాధాకరమైన మరణం సంభవించింది. వారి మృతికి సంబంధించిన ఆలోచనలే నా మదిలోకి వస్తున్నాయి” అని తెలిపారు. రావూస్ కోచింగ్ సెంటర్ ఘటన తర్వాత ఎంసీడీ నుంచి నోటీసులు అందుకొన్న పలు సంస్థల్లో ‘దృష్టి ఐఏఎస్’ కూడా ఉంది. ఆ నేపథ్యంలో వికాస్ స్పందన వచ్చింది. శనివారం సాయంత్రం రావూస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు ప్రవహించడంతో ముగ్గురు విద్యార్థులు తాన్యా సోని, శ్రేయా యాదవ్, నవిన్ డెల్విన్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కోచింగ్ సెంటర్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉందని 12 రోజుల క్రితమే కౌన్సిలర్‌కు తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తల్లి, పిల్ల కాంగ్రెస్‌లు కలిసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశాయి

విజయవాడ: తల్లి – పిల్ల కాంగ్రెస్ పేరిట ఏపీ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని విభజించి కాంగ్రెస్ సర్వనాశనం చేసిందంటూ దుమ్మెత్తి పోశారు. బీజేపీ ప్రస్తుతం ఏపీని ఆదుకుంటోందని.. అమరావతితో పాటు రైల్వే లైన్ కోసం నిధులు కేటాయించిందని ప్రశంసలు కురిపించారు. తల్లి, పిల్ల కాంగ్రెస్‌లు కలిసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాయని లంకా దినకర్ అన్నారు. తల్లి కాంగ్రెస్ చక్రవ్యూహ కబంధ హస్తాలలో రాష్ట్రం నలిగిందని పేర్కొన్నారు.

పిల్ల కాంగ్రెస్ చక్రబంధనంతో రాష్ట్రం రెక్కలు విరిగాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అశాస్త్రీయంగా రాష్ట్ర విభజన చేయుటమే కాకుండా, ఏపీ పునర్విభజన చట్టాన్ని అస్తవ్యస్తంగా తయారు చేయడం వెనుక జై రామ్ రమేష్, చిదంబరం ఉన్నారని లంకా దినకర్ అన్నారు. పోలవరం చెల్లని చెక్కు చేద్దామని కాంగ్రెస్ భావించింది. తల్లి, పిల్ల కాంగ్రెస్‌లు కలిసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశాయన్నారు. ఏడు మండలాలు ఏపీలో కలిపి ఇప్పటి వరకు 15 వేల కోట్ల రూపాయల నిధులు మోదీ సర్కార్ ఇచ్చిందని లంకా దినకర్ పేర్కొన్నారు. పోలవరం పూర్తి చేసే భాధ్యత కేంద్రానిదని బడ్జెట్ 2024 – 25 లో కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారని లంకా దినకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి 2500 కోట్లు నిధులతోపాటు, మౌలిక సదుపాయాలు, ఔటర్ రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ కోసం 3000 కోట్లు నిధులు, భూములిచ్చిన రైతులకు క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు విలువ 25 వేల కోట్లు పైమాటేనని లంకా దినకర్ పేర్కొన్నారు. అమరావతి రైల్ లైన్ కోసం 2,500 కోట్లు, దాదాపు 50 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు నిర్మించడానికి అడుగులు వేసిందన్నారు. రాజధాని నిర్మాణం చెల్లని చెక్కు చెయ్యాలని తల్లి కాంగ్రెస్ చూస్తే, జరిగే పురోగతిని పిల్ల కాంగ్రెస్ అధోగతి పట్టించిందని లంకా దినకర్ పేర్కొన్నారు.

# సడన్ గా ఈ ఫొటో ఏంటి అనుష్క?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క సోషల్ మీడియాలో అంత యాక్టివ్ గా ఉండదు. అప్పుడప్పుడు ఇన్ స్టాగ్రామ్ లో ఫోటోలని షేర్ చేస్తూ ఉంటుంది. అయితే లేటెస్ట్ ఫోటోలని మాత్రం ఆమె పెద్దగా ఇన్ స్టాగ్రామ్ లో పంచుకోదు. కేవలం తన మనసుకి నచ్చిన ఫోటోలని మాత్రమే షేర్ చేయడానికి ఇన్ స్టాగ్రామ్ వాడుతుంది. అయిన కూడా ఆమెని 6.9 మిలియన్స్ మంది ఇన్ స్టాగ్రామ్ లో ఫాలో అవుతూ ఉండటం విశేషం. ప్రస్తుతం అనుష్క మలయాళంలో ఒక పాన్ ఇండియా మూవీ చేస్తోంది. తెలుగులో క్రిష్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ రెండు షూటింగ్ దశలో ఉన్నాయి. గత ఏడాది మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో అనుష్క ప్రేక్షకుల ముందుకొచ్చి సక్సెస్ అందుకుంది. ఆ సమయంలో కూడా ఈ బ్యూటీ మీడియా



ముందుకి రావడానికి ఇంటరెస్ట్ చూపించలేదు. ప్రస్తుతం సినిమాలు సెట్స్ పైన ఉన్న కూడా మీడియా కంటికి చిక్కడం లేదు. బాహుబలి సిరీస్ తర్వాత అనుష్కని ఒరిజినల్ లుక్ ని పబ్లిక్ చూసింది చాలా తక్కువ సార్లు అని చెప్పొచ్చు. స్టార్ హీరోయిన్ గా ఉన్న కూడా ఫేమ్ కి దూరంగా ఆమె సింపుల్ లైఫ్ లీడ్ చేయడానికి ఇష్టపడుతుందని అనుష్క ఫ్యాన్స్ అంటూ ఉంటారు. ఇదిలా ఉంటే తాజాగా అనుష్క బాహుబలి సినిమాలోనే దేవసేన స్టిల్ ని తన ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. బాణం, విల్లు పట్టుకొని వీరనారిగా రెడ్ కలర్ శారీలో ఉన్న ఈ స్టిల్ కి ఏకంగా 1.93 లక్షల మంది లైక్స్ రావడం విశేషం. సడెన్ గా అనుష్క దేవసేన స్టిల్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేయడానికి కారణం ఏంటనేది మాత్రం ఎవ్వరికి అంతుచిక్కడం లేదు. అయితే అనుష్క ఫ్యాన్స్, డార్లింగ్ ప్రభాస్ అభిమానులు మాత్రం ఈ ఫోటోపై డిఫరెంట్ గా రియాక్ట్ అవుతున్నారు. బాహుబలి 3 అప్డేట్ అంటూ కొంతమంది కామెంట్స్ చేశారు. డార్లింగ్ ప్రభాస్ ది రాజాసాబ్ మూవీ ఫ్యాన్ ఇండియా గ్లింప్స్ ని చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. ఇందులో ప్రభాస్ రెడ్ కలర్ షూట్ వేసుకున్నారు. అందుకే సింబాలిక్ గా అనుష్క కూడా రెడ్ కలర్ శారీ ఫోటోని షేర్ చేసిందని ప్రభాస్ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. డార్లింగ్ ప్రభాస్ మీద ఉన్న లవ్ ని అనుష్క ఈ ఫోటోతో ఎక్స్ ప్రెస్ చేసిందని కూడా పోస్టులు పెడుతున్నారు. కొంతమంది అయితే ప్రభాస్ తో పెళ్లిపై అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ ఇవ్వాలని అనుష్కకి రిక్వెస్ట్ లు పెడుతూ ఉండటం విశేషం.

# మెగా ఫ్యాన్స్ ఈగర్లీ వెయిటింగ్ !

మెగా ఫ్యాన్స్ అంతా కూడా ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి చేస్తున్న విశ్వంభర సినిమా కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమాను వశిష్ట డైరెక్ట్ చేస్తుండగా త్రిష హీరోయిన్ గా నటిస్తుంది. ఆస్కార్ విన్నర్ కీరవాణి మ్యూజిక్ కూడా సినిమాకు సూపర్ బూస్ట్ ఇస్తుందని అంటున్నారు. విశ్వంభర సినిమా ఆడియన్స్ కు మంచి విజువల్ ట్రీట్ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అందుకే ప్రొడక్షన్ కాస్ట్ కాస్త ఎక్కువ అవుతుందని తెలుస్తున్నా నిర్మాతలు ఏమాత్రం కాంప్రమైజ్ అవ్వట్లేదని తెలుస్తుంది. స్టార్ సినిమాలు ఈమధ్య కథ మీద నమ్మకంతో కాంబినేషన్ సెట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే దానికి కావాల్సినంత బడ్జెట్ పెట్టేస్తున్నారు. విశ్వంభర సినిమా విషయంలో కూడా అంతే కథ మీద ఉన్న కాన్ఫిడెన్స్ తోని సినిమాకు కావాల్సినంత బడ్జెట్ సమకూరుస్తున్నారు. ఐతే చిరంజీవి విశ్వంభర సినిమా నుంచి టైటిల్ అనౌన్స్ మెంట్ రోజు ఒక టీజర్ వచ్చింది తప్ప మిగతా అప్డేట్స్ ఏమి రాలేదు. గ్లింప్స్ తోనే సినిమాపై అంచనాలు పెంచారు. ఐతే మెగా ఫ్యాన్స్ అంతా కూడా విశ్వంభర టీజర్ కోసం ఆసక్తిగా



ఎదురుచూస్తున్నారు. చిరు సినిమా టీజర్ ఎలా ఉండబోతుంది అన్న ఎగ్జైట్ మెంట్ మొదలైంది. సినిమా గురించి శాంపిల్ గా క్లూ ఇస్తూ వదిలే టీజర్ తోనే సినిమాపై అంచనాలు పెరుగుతాయి. ఈ క్రమంలో విశ్వంభర టీజర్ ఎలా ఉండబోతుంది. సినిమాలో చిరు ఎలా కనిపిస్తారన్న ఆసక్తి మెగా ఫ్యాన్స్ లో ఉంది. అందుకే చిరు సినిమా టీజర్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఆగష్టు 22 చిరంజీవి బర్త్ డే. మెగా ఫ్యాన్స్ పండగలా జరుపుకునే ఈ రోజు మెగా విశ్వంభర టీజర్ రాబోతుందని తెలుస్తుంది. సో ఆరోజు మెగా ఫ్యాన్స్ కి డబుల్ ధమాకా అని చెప్పొచ్చు. విశ్వంభర మాత్రమే కాదు మెగాస్టార్ చిరంజీవి నెక్స్ట్ చేయబోయే ప్రాజెక్ట్ గురించి కూడా బర్త్ డే రోజు ప్రకటన వస్తుందని తెలుస్తుంది. మొత్తానికి మెగాస్టార్ పుట్టినరోజు మెగా ఫ్యాన్స్ కు భారీ కానుకలే ఇచ్చేలా సెట్ చేశారని తెలుస్తుంది. చిరు నెక్స్ట్ సినిమా హరీష్ శంకర్ డైరెక్షన్ లో ఉంటుందని లేటెస్ట్ టాక్. అదే నిజమైతే మెగా ఫ్యాన్స్ కి ఒక మంచి మాస్ బొమ్మ అందించేందుకు హరీష్ శంకర్ కృషి చేస్తారని చెప్పొచ్చు. ప్రస్తుతం ఆయన డైరెక్ట్ చేస్తున్న మిస్టర్ బచ్చన్ ఆగష్టు 15న రిలీజ్ అవుతుండగా ఆ సినిమా ప్రచార చిత్రాలైతే అదిరిపోయేలా ఉన్నాయి.




# తంగం అంతరంగం హాయిగా...!



ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో షూటింగ్ ను ముగించేందుకు రెడీ అయ్యారు. ప్రస్తుతం కీలకమైన ఎన్టీఆర్, జాన్వీ కపూర్ ల డ్యూయెట్ చిత్రీకరణ జరుపుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. తాజాగా ఆ పాటకు సంబంధించి రచయిత రామ జోగయ్య శాస్త్రి ఆసక్తికర ట్వీట్ చేసి అంచనాలు పెంచాయి.

దేవర నుంచి వచ్చిన మొదటి పాట ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఆ పాట తర్వాత రాబోతున్న పాట అంతకు మించి ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. వెయిట్ చేసినందుకు తగిన ఫలితం ఉంటుంది అంటూ రామ జోగయ్య శాస్త్రి ప్రకటించాడు. ఆయన ట్విట్టర్ లో... తంగం అంతరంగం హాయిగా ఉయ్యాల ఊగుతున్నట్లు ఉంటుంది ఇప్పుడే విన్నా అతి త్వరలోనే సాంగ్ వచ్చేస్తుంది అంటూ ట్వీట్ చేశాడు. దేవర సినిమాలో జాన్వీ కపూర్ పోషిస్తున్న పాత్ర పేరు తంగం అనే విషయం తెల్సిందే. ఆమె పేరు మీద ఈ పాట ఉంటుందని శాస్త్రి ట్వీట్ తో క్లారిటీ వచ్చింది. ఈ పాట లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ లు రొమాంటిక్ డాన్స్ తో అదరగొట్టబోతున్నారు అంటూ మేకర్స్ నుంచి సమాచారం అందుతోంది. ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత చేస్తున్న సినిమా అవ్వడంతో పాటు, జాన్వీ కపూర్ మొదటి సారి తెలుగు లో నటిస్తున్న సినిమా ఇదే అవ్వడం వల్ల అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా ఉంటుంది అనే నమ్మకంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్ లో విడుదల అవ్వబోతున్న దేవర సినిమాలో బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సెప్టెంబర్ చివరి వారంలో విడుదల అవ్వబోతున్న దేవర కి సీక్వెల్ కూడా ఉంటుందని ఇప్పటికే ప్రకటించారు. దేవర హిట్ అయితే వెంటనే దేవర 2 ను మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి.

# మహానటి విషయంలో ఆ డౌట్లు అక్కర్లేదు..!





తన సహజ నటనతో సౌత్ ఆడియన్స్ అలరిస్తూ వస్తున్న కీర్తి సురేష్ మహానటి సినిమాతో నేషనల్ అవార్డ్ పర్ఫార్మెన్స్ ఇచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన మహానటి సినిమా లో కీర్తి సురేష్ ని సెలెక్ట్ చేశారని తెలియగానే అంత గొప్ప నటీమణి పాత్రలో కీర్తి ఎలా కనిపిస్తుందో అని అనుకున్నారు. కానీ సినిమా రిలీజ్ అయ్యాక చూసి ఆడియన్స్ సైతం షాక్ అయ్యేలా తన అభినయంతో మెప్పించింది. కొన్ని సినిమాలు కొందరి కోసమే అనేలా క్రేజ్ తెచ్చుకుంటాయి. అలానే సావిత్రి బయోపిక్ కీర్తి సురేష్ ముందు మరో హీరోయిన్ ను అనుకున్నా ఆమె కాదని చెప్పడంతో కీర్తికి ఛాన్స్ వచ్చింది. ఇక వచ్చిన ఆ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని సత్తా చాటింది కీర్తి సురేష్. ఐతే ఈమధ్య కొంత గ్లామర్ రోల్స్ చేస్తున్న కీర్తి సురేష్ లోని ఆ సహజ నటిని మళ్లీ చూడగలమా అని కొందరు ఆడియన్స్ డౌట్ పడుతున్నారు. సౌత్ నుంచి ఈమధ్యనే బాలీవుడ్ వెళ్లిన కీర్తి సురేష్ అక్కడ గ్లామర్ డోస్ పెంచి బీ టౌన్ ఆడియన్స్ మెప్పు పొందాలని చూస్తుంది. ఐతే కీర్తి సురేష్ లోని ఈ మార్పు కొంతమంది ఫ్యాన్స్ కి నచ్చట్లేదు. గ్లామర్ డాల్ గా మారిన కీర్తి మళ్లీ అభినయ ప్రాధాన్యత ఉన్న పాత్రలు వస్తే చేస్తుందా అన్న డౌట్ మొదలైంది. అయితే కీర్తి ప్లానింగే అది అన్నట్టుగా చెబుతున్నారు. ఓ పక్క గ్లామర్ రోల్స్ చేస్తూ సౌత్ లో వచ్చే ప్రతిభ చూపించే పాత్రలు చేస్తే మాత్రం సూపర్ అనిపించుకో వచ్చు. ఐతే ఒక్కసారి గ్లామర్ రోల్స్ చేస్తూ వచ్చాక కీర్తి మళ్లీ వీటి వైపు చూస్తుందా వీటిని ఓకే చేస్తుందా అంటే ఆమెలోని నటి తప్పకుండా ఈ రోల్స్ ని యాక్సెప్ట్ చేస్తుందని అంటున్నారు. ఎంత బాలీవుడ్ వెళ్లినా సరే కీర్తికి మంచి పాపులారిటీ తెచ్చిన పాత్రలని మర్చిపోయే ఛాన్స్ లేదు. ఆ రిఫరెన్స్ లను లేదా ఆ సినిమాలను మళ్లీ కీర్తి సురేష్ మరోసారి చూసుకుంది అంటే చాలు. మళ్లీ అమ్మడు నటనా ప్రాధాన్యత ఉన్న పాత్రలకు ఓకే చెప్పేస్తుంది. తెలుగులో అయితే లాస్ట్ ఇయర్ దసరా చేసిన కీర్తి సురేష్ మరో సినిమా ఓకే చేయలేదు. కోలీవుడ్ లో కూడా కీర్తి సురేష్ దూకుడు తగ్గిందనే చెప్పాలి. ఐతే ఈమధ్యే బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అక్కడ వరుస ఛాన్సులు అందుకునేలా గ్లామర్ షో చేస్తుంది.

# ఆన్ స్క్రీన్ అలా.. ఆఫ్ స్క్రీన్ ఇలా.. అమ్మడు కుమ్మేస్తుంది..!

టాలీవుడ్ లో నెక్స్ట్ టాప్ ప్లేస్ కి వెళ్లే ఛాన్స్ ఎవరికి అంటే ఎక్కువ శాతం ఆడియన్స్ ఎంపిక చేసుకునే పేరు మీనాక్షి చౌదరి. సుశాంత్ నటించిన ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మీనాక్షి ఆ సినిమా నుంచి వస్తున్న ప్రతి ఆఫర్ ను చేస్తూ ప్రేక్షకులను అలరిస్తుంది. ఖిలాడి, హిట్ 2 ఇలా ఓ పక్క యువ హీరోల సరసన చేస్తూనే మహేష్ లాంటి స్టార్ సినిమాలో చిన్న పాత్రను సైతం ఎలాంటి డౌట్లు లేకుండా చేసింది. తెలుగులో అమ్మడి కెరీర్ ఇలా ఉంటే కోలీవుడ్ లో మాత్రం స్టార్స్ తో జత కట్టేస్తుంది. దళపతి విజయ్ గోట్ లో అమ్మడు ఫిమేల్ లీడ్ గా నటించింది. ప్రస్తుతం తెలుగులో కూడా విక్టరీ వెంకటేష్, అనీల్ రావిపుడి కాంబో సినిమాతో పాటుగా మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్



సినిమాలో కూడా నటిస్తుంది. విశ్వక్ సేన్ మెకానిక్ రాకీ సినిమాలో కూడా మీనాక్షి నటించింది. ఐతే ఓ పక్క సినిమాలతో అదరగొట్టేస్తున్న అమ్మడు ఆఫ్ స్క్రీన్ ఫోటో షూట్స్ తో కూడా వారెవా అనిపిస్తుంది. మీనాక్షి షేర్ చేస్తున్న ఫోటో షూట్స్ కి సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు. తన న్యాచురల్ లుక్స్ తో కుర్రాళ్ల హృదయాలను గిలిగింతలు పెట్టేస్తుంది అమ్మడు. తెర మీద అందంగా కనిపించిన ప్రతి ఒక్కరు ఆఫ్ స్క్రీన్ లో ఆ మ్యాజిక్ కనిపించదు కానీ మీనాక్షి మాత్రం తెర మీద కన్నా ఆఫ్ స్క్రీన్ ఫోటో షూట్స్ లో మరింత అందంగా కనిపిస్తుంది. లేటెస్ట్ గా విశ్వక్ సేన్ మెకానిక్ రాకీ గ్లింప్స్ రిలీజ్ టైంలో కూడా తన లుక్స్ తో ప్రేక్షకులను ఇంప్రెస్ చేసింది మీనాక్షి. శారీ లో అమ్మడు అందాలను చూసేందుకు రెండు కళ్లు సరిపోలేదంటే నమ్మాల్సిందే అనేలా ఉంది. ఆన్ అండ్ ఆఫ్ స్క్రీన్ మీనాక్షి చేస్తున్న ఈ మ్యాజిక్ చూసిన ఎవరైనా సరే కచ్చితంగా అమ్మడు టాప్ రేంజ్ కి వెళ్తుందని ఒప్పుకుంటారు. రాబోతున్న సినిమాలన్నీ భారీ అంచనాలతో వస్తున్నావే కాబట్టి మీనాక్షి కోరుకునే స్టార్ క్రేజ్ దక్కుతుందేమో చూడాలి. ఎవరో ఇవ్వడం కాదు ఆ ఇమేజ్ వచ్చే దాకా మీనాక్షి కూడా ఎక్కడ తగ్గేలా లేదని అనిపిస్తుంది.

# తెల్ల చీరలో తాప్సీ పువ్వందం!

తాప్సీ సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రొఫెషనల్ గా ఎంత బిజీగా ఉన్నా ప్రయివేట్ ఫోటోలతోనూ అలరించడం అమ్మడి స్పెషాల్టీ. బాలీవుడ్ కి వెళ్లిన నాటి నుంచి ఈ రూల్ తూచ తప్పకుండా ఫాలో అవుతోంది. అక్కడి ట్రెండ్ ని అనుసరిస్తూ గ్లామర్ వరల్డ్ లో ముందుకు దూసుకుపోతుంది. ఫ్యాషన్ ఎంపికల్లో తనదమైన మార్క్ ఎలివేషన్లతో ఆకట్టుకున్న సందర్భాలెన్నో. ఉత్తరాది అభిమానుల అభిరుచికి తగ్గట్టు ఇప్పటికే రూప లావణ్యంలో ఎన్నోమార్పులు చేసింది. మోడ్రన్ దుస్తుల్లో సెగలు మురిపిస్తుంది. తాజాగా అమ్మడు చీరందంలో తళుక్కున మెరిసింది. పాలనురుగల సౌందర్యంపై తెలుపు వర్ణం- గులాబీ రంగు పువ్వున్న చీరను ధరించింది. చీరందంలో తాప్సీ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది.



వైట్ స్కిన్ పై వైట్ సారీ వావ్ లో అనిపిస్తోంది. చీరని మ్యాచ్ చేస్తూ అందమైన జడను అల్లుకుంది. చేతిలో తెలుపు వర్ణం పువ్వు ను చూస్తూ ..పెదాలపై సన్నని నవ్వును చిందిస్తూ కెమారాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అభిమానులు తాప్సీ అందానికి పుల్లకించి పోతున్నారు. ఎవరి స్టైల్లో వారు కామెంట్లు పోస్టు చేస్తున్నారు. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే కొంత కాలంగా బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ కంటే బాలీవుడ్ లో బెటర్ గానే కొనసాగుతుంది. అక్కడికి వెళ్లిన తర్వాత సొంతంగా నిర్మాణ సంస్థని సైతం స్థాపించి పరిమిత బడ్జెట్ లో సినిమాలు నిర్మిస్తుంది. అక్కడి సెలబ్రిటీలందరితో అంతే మింగిల్ అవుతుంది. అందుకు తగ్గ ప్రణాళిక వేసుకుని వెళ్తుంది. గత ఏడాది ఒకే ఒక్క సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చినా ఈ ఏడాది మాత్రం నాలుగైదు సినిమాలో రావడం పక్కాగా కనిపిస్తుంది.

ఇప్పటికే కొన్ని కమిట్ అయిన ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అవి షూటింగ్ దశలో ఉన్నాయి. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. లాక్ అయితే ఏడాది ముగింపుకల్లా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది.




హైదరాబాద్: శాసనసభ సమావేశాల్లో మంత్రి సీతక్క భారాసపై ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని భారాస నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు పత్రాన్ని కాంగ్రెస్‌లో గెలిచి భారాసలోకి వచ్చిన సబితా ఇంద్రారెడ్డితో ఇప్పించారని ఎద్దేవా చేశారు. భారాస వాళ్లు రాజీనామా చేయించి ఎమ్మెల్యేలను చేర్చుకున్నారా అని ప్రశ్నించారు. ఈక్రమంలో సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు తనను టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని.. ఓ అక్కగా కాంగ్రెస్‌లోకి సంతోషంగా ఆహ్వానించినట్లు గుర్తుచేశారు. "రేవంత్‌రెడ్డికి నాపై ఎందుకు కక్ష?. ఆరోజు పార్టీలోకి వచ్చినప్పుడు కాంగ్రెస్ ఆశాకిరణం అవుతావని చెప్పాను. సీఎం అవుతావని కూడా చెప్పాను. మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను" అని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "సబితక్క నన్ను పార్టీలోకి ఆహ్వానించిన మాట వాస్తవం. వ్యక్తిగతంగా జరిగిన సంభాషణ సభలో చెప్పారు. సబిత సభలో ప్రస్తావించారు కాబట్టే.. అప్పుడు జరిగిన పరిణామాలు సభలో చెప్పాలి. 2019లో మల్కాజిగిరిలో పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే అండగా ఉంటానని సబితక్క మాట ఇచ్చారు. కాంగ్రెస్ నన్ను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే ఆమె భారాసలో చేరారు. అధికారం కోసం కాంగ్రెస్‌ను వదిలి భారాసలో చేరి మంత్రి పదవి తీసుకున్నారు. తమ్ముడిగా నన్ను మోసం చేశారు కాబట్టే ఆమెను నమ్మవద్దని కేటీఆర్‌కు చెప్పా.

మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే గెలిపించే బాధ్యత నాదే అని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. నేను చెప్పింది నిజమో.. కాదో.. సబితక్క గుండె మీద చేయి వేసుకుని చెప్పాలి" అని రేవంత్ చెప్పారు.




**మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడాన్ని తప్పుబట్టారు. కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామన్నారని, అందుకే ముందు జాగ్రత్తగా బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు వేసుకొచ్చామన్నారు.**

# అప్పులు చెప్పిన వాళ్లు.. ఆస్తులు కూడా చెప్పాల్సిందే...



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏడో రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఆపై ద్రవ్య వినిమయ బిల్లుపై సభలో చర్చ ప్రారంభమైంది. బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ చర్చను మొదలుపెట్టారు. పదేళ్ల క్రితం కిరణ్‌కుమార్‌రెడ్డి.. తెలంగాణ చీకట్లతో నిండిపోతుందని చెప్పారని.. తెలంగాణ వారికి పాలించే సత్తా ఉందా?.. అని ఉమ్మడి రాష్ట్రంలో హేళన చేశారని గుర్తుచేశారు. పదేళ్లలో రాష్ట్ర సంపద పెరిగిందని గతంలో భట్టి విక్రమార్క చెప్పారని.. కానీ అధికారంలోకి వచ్చాక.. మాట మారుస్తున్నారన్నారు. విభజన జరిగితే తెలంగాణ అంధకారం అవుతుందన్నారని.. తెలంగాణ వస్తే శాంతిభద్రతల సమస్యలు వస్తుందన్నారని అన్నారు. ఏపీ – తెలంగాణలో మత ఘర్షణలు వస్తాయన్నారని, అలాగే తెలంగాణలో నక్సలైట్ల రాజ్యం వస్తుందన్నారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. అంతేకాకుండా తెలంగాణ వారికి పరిపాలన సామర్థ్యం ఉందా? అని కూడా అన్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావని.. ఉన్నవి పోతాయన్నారని తెలిపారు. కానీ ఇప్పుడు టాప్–4 స్టేట్స్‌లో తెలంగాణ ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టులోనే పరస్పర విరుద్ధ అంశాలు ఉన్నాయన్నారు. "బీఆర్ఎస్ పాలన గురించి మీరు మాట్లాడుతున్నప్పుడు.. గత కాంగ్రెస్ పాలనపై మేమెందుకు మాట్లాడకూడదు" అని ప్రశ్నించారు. ఓట్లకు ముందేమో అభయహస్తం.. ఓట్ల తర్వాత శూన్యహస్తమని విమరశించారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. మంచి నిర్ణయాలకు బీఆర్ఎస్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందన్నారు. స్కిల్ వర్సిటీని తప్పకుండా స్వాగతిస్తామని తెలిపారు. రాష్ట్రం క్యాన్సర్, ఎయిడ్స్ రోగిలా దివాలా తీసిందనడం కరెక్ట్ కాదన్నారు. కరోనాతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందన్నారు. కరోనా ముందు తాము కూడా జీతాలు సక్రమంగానే ఇచ్చామని చెప్పారు. రైతుబంధు, పింఛన్లు, కల్యాణలక్ష్మి ఆగవద్దని అనుకున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే సాయం ఆపకూడదని నిధులు మళ్లించి ఉండవచ్చని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్లకు 10 నెలలుగా జీతాలు లేవని.. బీఆర్ఎస్ పాలనలో అప్పులు.. రెవెన్యూ బిల్లులకు లోబడి ఉన్నామన్నారు. "మేం చేసిన నికర అప్పు రూ.3,85,340 కోట్లు మాత్రమే. మేం చేసిన అప్పులు చెప్పినవాళ్లు.. మేం ఇచ్చిన ఆస్తుల గురించి చెప్పాలి. సందప చూస్తేనే అప్పులు ఇస్తారు" అని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే.. బడ్జెట్‌లో కోతలు, ఎగవేతలతో మసిబూసి మారేడుకాయ చేశారు. రైతు భరోసాకు బడ్జెట్ ఏదని ప్రశ్నించారు. పెన్షన్ డబుల్ చేసే కేటాయింపులు ఎక్కడని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు ఎన్నికల ముందు రజినీకాంత్, తర్వాత గజినీకాంత్‌లా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ పోరాటాల గడ్డ.. మభ్యపెడితే ఊరుకోదని కేటీఆర్ అన్నారు. చార్జిషీట్లు, రికవరీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై వేయాలన్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కేటీఆర్ సవాల్ ఒకటి విసిరారు. అశోక్ నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి వెళదామని.. ఒక్క కొత్త ఉద్యోగం ఇచ్చినట్లు యువకులు చెబితే అక్కడే రాజీనామా చేయడమే కాదు.. రాజకీయ సన్యాసం చేస్తానంటూ కేటీఆర్ ఛాలెంజ్ చేశారు. పైగా రేవంత్, భట్టికి పౌర సన్మానం కూడా చేస్తామని కేటీఆర్ వెల్లడించారు.




## అసెంబ్లీలో కేటీఆర్ పద్యం

కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ ఫోబియా పట్టుకుందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఆనవాళ్ల చెరిపివేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పదేళ్ల భారాస పాలనలో కేసీఆర్‌వి చెరిపివేయలేని ఆనవాళ్లు ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేటీఆర్ ప్రసంగించారు. కాళేశ్వరం జలసవ్వడిలో కేసీఆర్.. కాకతీయ చెరువు మత్తడిలో కేసీఆర్.. పాలమూరు జలధారల్లో కేసీఆర్ అంటూ కేటీఆర్ పద్యం చదివారు.

# నూతన గవర్నర్ జిష్ణుదేవ్‌కు స్వాగతం పలికిన సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 31: శంషాబాద్ విమానాశ్రయంలో తెలంగాణ నూతన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. బుధవారం త్రిపుర నుంచి శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న నూతన గవర్నర్‌కు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, త్రివిధ దళాలల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు హర్కార వేణుగోపాల్ రావు, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయంలో సాయుధ దళాల గౌరవ వందనాన్ని నూతన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ స్వీకరించారు.






# రేవంత్‌రెడ్డి నాకు మంచి మిత్రుడు.. 18 ఏళ్ల నుంచి తెలుసు: కేటీఆర్

హైదరాబాద్: అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏకవచనంతో కేటీఆర్ పిలవడంపై అధికార పక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. "రేవంత్ రెడ్డి నాకు 18 ఏళ్ల నుంచే తెలుసు. ఆయన నాకు మంచి మిత్రుడు. అయితే.. గత పదేళ్ల నుంచి మాకు, ఆయనకు చెడింది. ఆయన అదృష్టవంతుడు.. చిన్న వయసులోనే సీఎం అయ్యారు. సీఎంను ఏకవచనంతో పిలిచినందుకు ఎవరైనా బాధపడి ఉంటే నా మాటలను వెనక్కి తీసుకుంటున్నాను" అని కేటీఆర్ అన్నారు.




హైదరాబాద్: అంగన్వాడీ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. అంగన్ వాడీలకు పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలను అందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. అంగన్ వాడీ టీచర్ కు రెండు లక్షల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందుతాయని తెలిపారు. అంగన్ వాడీ హెల్పర్ కు రిటైర్ అయిన తర్వాత లక్ష రూపాయలు అందచేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

ఇటీవలే అంగన్ వాడీ టీచర్లకు, వర్కర్లకు వేతనాలు పెంచాలని.. రిటైర్ మెంట్ తరువాత బెనిఫిట్స్ కల్పించాలని ధర్నా చేసిన విషయం తెలిసిందే. అయితే టీచర్లు, కార్యకర్తలకు మంత్రి సీతక్క తాజాగా గుడ్ న్యూస్ చెప్పారు. రిటైర్ అయ్యే టీచర్లకు ప్రస్తుతం రూ.1లక్ష ఇస్తుండగా.. ఇక నుంచి రూ.2లక్షలు ఇవ్వనున్నట్టు తెలిపారు. అదేవిధంగా కార్యకర్తలకు ప్రస్తుతం రూ.50వేలు ఇస్తుండగా.. ఇక నుంచి రూ.1లక్షకు పెంచి ఇస్తామని వెల్లడించారు.

ఈ ప్రతిపాదనలను ఇప్పటికే ఆర్థిక శాఖకు పంపినట్టు తెలిపారు. ప్రస్తుతం రిటైర్డ్ అయ్యే టీచర్లకు ఇది వర్తిస్తుందా లేదా అనేది మాత్రం ఇంకా క్లారిటీ లేదు.



# గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత... సీఎం డౌన్ డౌన్ అంటూ

హైదరాబాద్, జూలై 31: అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బుధవారం అసెంబ్లీని ముట్టడించేందుకు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నేతలు యత్నించారు. అసెంబ్లీ వద్దకు చేరుకున్న వారిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. దీంతో అక్కడ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30శాంత నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలన్నారు. విద్యా శాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే రూపొందించి, ఉద్యోగాల ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పోలీసుల అరెస్టుకు నిరసనగా సీఎం డౌన్ డౌన్ అంటూ విద్యార్థి సంఘం నాయకులు నినాదాలు చేశారు.

**అసెంబ్లీ లోపలా రచ్చరచ్చే...** మరోవైపు అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటలు శృతిమించాయి. ఏడవ రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ద్రవ్యవినిమయ బిల్లును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, ముఖ్యమంత్రి మధ్య మాటల యుద్ధం నడిచింది. అలాగే కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రులు కూడా కౌంటర్‌లు ఇచ్చారు. ముందుగా కేటీఆర్ మాట్లాడుతూ... విభజన జరిగితే తెలంగాణ అంధకారం అవుతుందన్నారని.. తెలంగాణ వస్తే శాంతిభద్రతల సమస్యలు వస్తుందన్నారని అన్నారు. ఏపీ – తెలంగాణలో మత ఘర్షణలు వస్తాయన్నారని, అలాగే తెలంగాణలో నక్సలైట్ల రాజ్యం వస్తుందన్నారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. అంతేకాకుండా తెలంగాణ వారికి పరిపాలన సామర్థ్యం ఉందా? అని కూడా అన్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావని.. ఉన్నవి పోతాయన్నారని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు టాప్–4 స్టేట్స్‌లో తెలంగాణ ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టులోనే పరస్పర విరుద్ధ అంశాలు ఉన్నాయన్నారు. "బీఆర్ఎస్ పాలన గురించి మీరు మాట్లాడుతున్నప్పుడు.. గత కాంగ్రెస్ పాలనపై మేమెందుకు మాట్లాడకూడదు" అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో కోతలు, ఎగవేతలతో మసిబూసి మారేడుకాయ చేశారు. రైతు భరోసాకు బడ్జెట్ ఏదని ప్రశ్నించారు. పెన్షన్ డబుల్ చేసే కేటాయింపులు ఎక్కడని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు ఎన్నికల ముందు రజినీకాంత్, తర్వాత గజినీకాంత్‌లా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అయితే కేటీఆర్‌కు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు.. ఇచ్చిన హామీలు ఒక్కొకటి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. మేము చేయకపోతే ప్రజలే మాకు బుద్ధి చెబుతారన్నారు. కొంచెం ఓపికగా ఉండాలని అని మంత్రి సీతక్క అన్నారు. దీనికి తిరిగి కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఓపికగా ఉండాల్సింది మంత్రులు అని.. తాము కాదని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ సత్యదూరంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కూడా మాకు పోటీగా హామీలు ఇచ్చిందన్నారు. కానీ ప్రజలు మిమ్మల్ని నమ్మలేదన్నారు. కాంగ్రెస్ తోనే మార్పు సాధ్యం అని ప్రజలు నమ్మారన్నారు. మమ్మల్ని గెలిపించారని.. మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారన్నారు. మొదటి బడ్జెట్‌కే ఇంత భయపడితే.. మరో నాలుగు బడ్జెట్‌లు ప్రవేశ పెడితే ఎంత భయపడతారని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య మాటల యుద్ధం నెలకొంది. కేటీఆర్‌కు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లకు పోలిక ఉందని.. కేటీఆర్ వంద పర్సెంట్ ఆర్టిఫిషియల్, సున్నా పర్సెంట్ ఇంటిలిజెన్స్ అంటూ సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. కేటీఆర్‌కు ఓపిక, సహనం ఉండాలని సలహా ఇచ్చారు. కేటీఆర్‌కు అనుకోకుండా పదవి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. సభను తప్పుదోవ పట్టించటానికి కేటీఆర్‌కు ఇచ్చిన సమయాన్ని వినియోగించుకోవడానికి చూస్తున్నారని మండిపడ్డారు. "పదేళ్ల మీ పాలనలో మీ అనుభవాలు మీకు ఉన్నాయి.. ప్రజలకు అనుభవాలు ఉన్నాయి. మీ పాలన అనుభవాలతో ప్రజలు మాకు అధికారం ఇచ్చారు" అని అన్నారు. పది నెలలు నిండని ప్రభుత్వంపై వందల ఆరోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో రైతు రుణమాఫీ.. రాహుల్ గాంధీ కీలక కామెంట్స్..

తెలంగాణలో ప్రస్తుతం రైతు రుణాల మాఫీ పండుగ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. తెలంగాణలో రైతుల పంట రుణాలను మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు రాహుల్ గాంధీ. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తెలంగాణలో మరో ఎన్నికల హామీని నెరవేర్చామని పోస్ట్ చేశారు రాహుల్. 'తెలంగాణలో రైతులకు మళ్లీ శుభాకాంక్షలు. మన ఎన్నికల హామీ ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రుణ మాఫీ రెండవ విడతను విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. రాష్ట్రంలోని 6.4 లక్షల రైతు కుటుంబాలకు రూ. 1.5 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేసి వారిని ఆదుకుంది. ఒక వైపు బీజేపీ దేశవ్యాప్తంగా రైతులను అప్పుల ఊబిలో కూరుకునేలా చేయడమే కాకుండా ఎంఎస్‌పీకి చట్టబద్ధత కూడా కల్పించడం లేదు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రతి సందర్భంలోనూ రైతు కుటుంబాలకు సహాయం అందించడానికి కృషి చేస్తుంది. INDIA కూటమి భారత దేశ రైతులకు MSP పైన చట్టపరమైన హామీ ఇచ్చి, రుణ విముక్తులను చేస్తుంది.' అని ఎక్స్‌లో పేర్కొన్నారు రాహుల్ గాంధీ.




Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com